ప్రతి విద్యాసంస్థలోను ఉత్తమ విద్యా వాతావరణం వెల్లివిరియాలి. ఇందుకు విద్యాసంస్థల యజమానులు, రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు ఎంతో బాధ్యతతో పాటుపడాల్సి ఉంది. రాష్ట్రప్రభుత్వం విద్యాసంస్థల శ్రేయస్సు, ఉత్తమ విద్యావ్యాప్తి, ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా ప్రత్యేక విద్యా ప్రణాళికలను అవశ్యం తయారుచేసి అమలు చేయాల్సి ఉంది. విద్యాసంస్థల యజమానులు వ్యాపార దృక్పథం మాని విద్యావ్యాప్తి, ఉత్తమ విద్యాప్రమాణాలు, జాతీయాభ్యుదయం ఆకాంక్షిస్తూ అటువంటి ప్రణాళికలు సఫలం కావటానికి చిత్తశుద్ధితో కృషిచేయాల్సి ఉంది.

ఉపాధ్యాయుల నియామకం, విద్యార్థుల ప్రవేశార్హతలు నిర్ణయించటానికి నియమావళులు రూపొందించాల్సి ఉంది. ప్రభుత్వం, యూనివర్శిటీగ్రాంట్సు కమిషన్‌వారు నడిపే ప్రత్యేక విద్యాకేంద్రాలకు హాజరు కావటానికీ, విద్యాసక్తి, బోధనా సామర్థ్యం పెంపొందటానికి తోడ్పడే సంచికలు ప్రచురించటానికి తగిన ఆర్థిక వనరులు ప్రతి కళాశాలలోను ఉపాధ్యాయులకు కల్పించాల్సి ఉంది.

ఉపాధ్యాయుని పాండిత్య ప్రతిభలు, దక్షతకూడ ప్రమోషన్లకు కొలబద్ద కావాల్సి ఉంది. కేవలం సీనియారిటీని పరిగణించి ప్రమోషన్లు చేయుటంవలన నేడు విద్యా ప్రమాణాలు సన్నగిల్లటం ప్రత్యక్షానుభవమేకదా! విద్యా ప్రమాణాలు పెరగక పోవటానికి ఇంకెన్నో కారణాలు ఉన్నమాట నిజం.

రాజకీయ ప్రభావానికి గురికాని కళాశాలలు మన రాష్ట్రంలో ఎన్ని ఉన్నాయి? రాజకీయాలతో రాణింపచూసే అధ్యాపకులులేని కళాశాలలు ఎన్ని ఉన్నాయి? కళాశాలలో ఉపాధ్యాయులకు ఎదురయ్యే కంటకప్రాయమైన సమస్యలు తల ఎత్తటానికి రాజకీయాలతో రాణింపచూసే ఉపాధ్యాయులు ఎంతవరకు కారణం? పాలకవర్గాలు ఎంతవరకు కారణం? ప్రభుత్వ ఔదాసీన్య వైఖరి ఎంతవవరకు కారణం? ఉపాధ్యాయ లోకాన్ని ఆవరించి వేధిస్తున్న దౌర్బల్యం ఏమిటి! ఇందు సమాజంనుండి ఉపాధ్యాయ లోకంలో ప్రవేశిస్తున్న దౌర్బల్య శక్తులేమైనా ఉన్నవా? ఉపాధ్యాయ లోకంలోనే ఉత్పన్నమౌతూ ఉపాధ్యాయులను దుర్భర, దుస్సహ దుస్థితికి గురిచేస్తున్న విచ్ఛిన్నకర రాజకీయ శక్తులు ఏమైనా ఉన్నవా? అనే అంశాలు అవశ్యం పరిశీలించాల్సి ఉంది.

## ఉపాధ్యాయ సంఘాలు

ఉపాధ్యాయ సంఘాలు ఇందుకు ఉత్తమ సాధనోపాయంగావాల్సి ఉంది. 'గురు దేవోభవ'అన్న భారత దేశంలోనే ఉపాధ్యాయుడు అనాథగా అవమానంతో అధ్వాన్నమైన అధోగతి జీవితాన్ని గడపటం చూస్తున్న సత్యం. ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని, సమాజాన్ని, విద్యాసంస్థల యజమానులను తమ యాతనావహ జీవనానికి కారణం అని నేడు దూషించక తప్పటంలేదు. ఇందుకు ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులు కొరగానివారు, అసమర్థులు, వ్యర్థులు, అనర్హులని సమాజం ఆడి పోసుకోవటం నేడు జరుగుతున్న వింత నాటకం.

ఉపాధ్యాయుడు సంస్కారి, సంస్కర్త, శిల్పి బోధకుడు, జ్ఞాని, ప్రతిభావంతుడనే జ్ఞానం సమాజానికి లేదా! తనచే తీర్చిదిద్దబడి, ప్రతిభావంతులు, నాయకులు, పరిపాలకులు అయినా వారే తమను ఎందుకు యాతనావహ దుర్భర జీవనంతో కుంది వందురునట్లు చేస్తున్నారు!!

"ఇదే తెలుసుకోవలసిన వింత సుమా?"

ఈనాటకాన్ని తుదముట్టించటానికి ఉపాధ్యాయ సంఘాలు సర్వసన్నద్ధం కావాలి. ఇందుకు నాంది పలకాల్సింది ఉపాధ్యాయవాణి. దృఢ దీక్షతో తమ సంఘాల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేయాల్సింది ఉపాధ్యాయలోకం. ఆధునిక ఉపాధ్యాయుని గురుతర బాధ్యత ఏమిటని సమాజానికి కనువిప్పు కలిగించాల్సింది ఉపాధ్యాయ సంఘాలు. ఉపాధ్యాయుని ఆత్మ గౌరవం జాతిగౌరవానికి ప్రతిబింబం. ఉపాధ్యాయుని జీవనస్థాయి జాతీయ జీవన స్థాయికి పడికట్టురాయి. ప్రతిభావంతులు ఉపాధ్యాయవృత్తి స్వీకరించి, విద్యారంగంలో అవిరళకృషి చేసిననాడే దేశానికి రక్ష, అభ్యుదయం, జాతికి ముక్తి ఉందని ఎలుగెత్తి చాటాల్సింది. ఉపాధ్యాయ సంఘాలు. ఉపాధ్యాయులు నిర్వహించాల్సిన బాధ్యతలముందు వారు కోరే సర్వీసు నియమాలు, జీతనాతాలు, ఉద్యోగ భద్రతలు అత్యల్పములని ప్రభుత్వం, విద్యాసంస్థల పాలకవర్గాలు తక్షణం గమనించాల్సి ఉంది. తగిన చర్యలు అవశ్యంగైకొనాల్సి ఉంది. తమకు జరిగే అన్యాయాలు, అక్రమాలు వైపుకు సమాజం దృష్టి మరల్చటానికి తగు కృషి అహరహం ఉపాధ్యాయ సంఘాలు అన్ని స్థాయిలలోనూ చేయాల్సి ఉంది.

విద్యాప్రమాణాల ఉద్ధరణ, ఉపాధ్యాయ వృత్తికి గౌరవం, సాంఘికౌన్నత్యం, జాతిశ్రేయస్సు అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయనే విషయం విజ్ఞులు విస్మరించరాదు. వీటిని సాధించటానికి ప్రభుత్వం, ఉపాధ్యాయులు, సమాజం సమబుద్ధితో కృషిసల్పిన నాడే విద్యాసంస్కరణలు సద్యఃఫలితాల నిస్తాయి. లేనినాడు అవి అడవిలోగాచిన వెన్నెలవుతాయి. నేల విడిచి సాముచేసిన చంద మవుతాయి. అట్లుసమబుద్ధితో కృషి సల్పిననాడే విజ్ఞానానికి, ఉత్తమ సంస్కృతికి మన విద్యాలయాలు నిలయమవుతాయి. "గురుదేవోభవ" నానుడి నినాదంగా ఈ సంఘాలు నిత్యం కృషి చేయాల్సి ఉంది.

విజ్ఞాన రంగంలో నిత్య నూతనంగా వర్ధిల్లుతున్న విప్లవ ప్రభావం మన పాఠశాలలు, కళాశాలలలో అంతగా కానరావటం లేదు. ఈ విప్లవ ప్రభావం విద్యార్థులపైన, తల్లిదండ్రుల పైన సోకునట్లు చేయటానికి నిరాడంబరం, నిర్మాణాత్మకం అయిన కార్యక్రమాలు ఉపాధ్యాయ సంఘాలు చేపట్టాల్సి ఉంది.

ఈ కార్యక్రమాలు కేవలం మంత్రులు, మహా నాయకులు, సమక్షంలో జరగాల్సిన అవసరం లేదు. విద్యాశ్రేయస్సు, విద్యా ప్రమాణాల ఉద్ధరణ, ఉపాధ్యాయుల గౌరవహోదాలు సంఘంలో పెరుగునట్లు చేయుట, విద్యార్థులలో విద్యాసక్తిని పెంపొందచేయుట, విద్యార్థులు - ఉపాధ్యాయుల సంబంధం మెరుగుపరచుట, క్రమశిక్షణగల వాతావరణం విద్యాసంస్థలలో నెలకొనచేయటం లాంటి కార్యక్రమాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యజమానులు, ఉపాధ్యాయులు, విద్యాధికారులు తరతమ భేదాలు మరచి ఐకమత్యంతో కృషి సల్పటానికి విధానాలు, పథకాలు మన ఉపాధ్యాయ సంఘాలు తయారుచేయాల్సి ఉంది. ఇది సాహసం ఎంత మాత్రం కాదు. దుస్సాధ్యం అంతకంటే కాదు. సంకల్పబలంతో దీనిని సుళువుగా సాధించగలం.

---

# గ్లాని

“అనూరాధ”

కాఫీ నాకందించలేదని
అలిగాననుకునేవు సుమా!
అలకగాదు—ఇది నా విసుగు.
బజారులో ఎక్కడ చూచిన
‘నో స్టాకు బోర్డు’ నా కంటి కగుపించె
అలిగాననుకునేవు సుమా!
అలకగాదు—ఇదీ నా విసుగు.
పోనీ చూద్దునుకద—అలక్కడేదో దొఱుకునని—
అయ్యో—యేమని చెప్పెద!
అంతా ‘స్టాకే!’ అయితే ప్రతిదీ ‘బ్లాకు!’
అలిగా ననుకునేవు సుమా!
అలకగాదు—ఇదీ నా విసుగు.
కానీ నా దగ్గర ‘బ్లాకులేదే’
స్టాకు లేదని అన్నందుకు కాదు నా బాధ,
అన్నదానిని నల్ల డిబ్బిచ్చి నేనెట్లు కొనెద?
అలుక కాదిది సుమా!
ఇదీ నా విసుగు—
ఏదీ, నా నల్ల కాఫీ ఏదీ?

# సంఘ సంస్కర్త—"రాయ్"

కొత్త రాజా ప్రతాప్,
II nd Inter.

పవిత్ర భారతదేశం అనాదినుంచి కొన్ని మూఢ నమ్మకాలలో, నిరుపయోగమయిన ఆచారములలో మునిగితేలుతూ ఉండేది. వాటిని సమూలంగా పెకలించి దేశ పురోభివృద్ధిని సాధించుటకు దృఢ నిశ్చయంతో అనేక కష్టాలు కోర్చి కృషిచేసిన వ్యక్తి మన భారతమాత ముద్దుబిడ్డయైన "రాజారామమోహన రాయ్." అట్టి మహనీయుని గూర్చి తెలుసుకోవలసిన విధి మనందరికి ఉంది.

వంగదేశంలోని రాధా నగరంలో రమాకాంత రాయ్, తారిణీదేవిలకు 1972 వ సం॥లో మే 22 వ తేదీన జన్మించాడు మన రాయ్. బాల్యంలోనే "ఆరాధన' యెడ అతనికి అపారమైన శ్రద్ధాభక్తులు కుదిరాయి. స్వగ్రామంలోనే వంగభాష, సంస్కృతము కొంత అభ్యసించి, పర్షియన్ భాష కూడ పఠించాడు. అతని చురుకుదనము, గ్రహింపుశక్తి కనిపెట్టి రమాకాంతుడు తనయునకు పారశీక, అరబ్బీ భాషలలో పై చదువులు చెప్పించడానికి పాట్నా పంపాడు. చిన్న వయసులోనే రామమోహనుడు మూలసిద్ధాంతాలను సుస్థిరముగా అవగతం చేసుకున్నాడు. పరిశుద్ధా సిక విశ్వాసానికి విరుద్ధమయిన పద్ధతిలో హిందువులుచేసే విగ్రహారాధన, మూర్తిపూజ హేతుబద్ధమయిన ఆరాధనా విధానం కాదని అతనికి తోచింది. హిందూ సమాజంలో వ్యాప్తిగా యున్న విగ్రహారాధన, మూఢాచారాలపై ఒక వ్యాసం వ్రాసి తల్లిదండ్రులకు కోపావేశాలను కల్గించాడు.

పిమ్మట తండ్రితో జరిగిన సంఘర్షణ మూలంగా స్వగ్రామాన్ని విడచి కాలినడకన టిబెట్టు వరకూ వెళ్ళాడు. అచ్చటి పూజారుల మూఢ విశ్వాసాలు అతనిలో సంచలనాన్ని రేకెత్తించాయి. సంప్రదాయ బద్ధమైన నాలుగు గోడల మధ్య కూపస్థ మండూకంలా బ్రతకడం కంటే, విశాల ప్రపంచంలో భావి జీవితం ఆశాజనకంగా అతనికి గోచరించింది.

1803లో తండ్రి మరణంతో ప్రభుత్వోద్యోగంలో ప్రవేశించిన రాయ్ నివాసాన్ని మూర్షిదాబాద్‌కు తరలించాడు. "తుహీఫత్-ఉల్-మువాహుద్దీన్" అనే గ్రంథాన్ని ప్రచురించాడు. దీనిద్వారా విగ్రహారాధన ఛాయలన్నిటినీ బహిరంగంగా ఖండించాడు. 1809లో జాన్ డిగ్బీదొర (రంగపూర్ కలెక్టరు) గారి వద్ద దివాన్‌గా చేరాడు. 1811 లో తన అన్నగారైన జగన్‌మోహనుడు మరణించాడు. మూఢాచారమయిన సహగమనం అనే మిషతో మంటలకు ఆహుతి అవుతున్న వదినగారిని రక్షించడానికి వ్యర్థ ప్రయత్నం చేశారు. ఈ ఘోర దురాచారాన్ని నిర్మూలనం చేసే వరకు నిద్రపోనని శపథం చేశాడు.

1814లో డిగ్బీ భారతదేశం విడచి వెళ్ళగానే రాయ్ కలకత్తాలో స్థిర నివాసం ఏర్పరచుకొన్నాడు. ఈయన 1816 లో వేదాంతసారమును వంగ భాషలోను, వేదాంతమును ఆంగ్లభాషలోను తర్జుమా చేశాడు. 1823 లో "హిందూ స్త్రీల హక్కులు పరిమితం చేసే ప్రయత్నం" అను శీర్షికతో చిన్న గ్రంథాన్ని వ్రాశాడు. ఈ గ్రంథంలో పిత్రార్జితంలోను, భర్తల ఆస్తులలోను హిందూ స్త్రీలు భాగస్వాములు అయ్యే హక్కులుండాలని ప్రతిపాదించాడు. 1827లో "వజ్రసూచి" అనే సంస్కృత గ్రంథాన్ని తన సంపాదకత్వంలో ప్రకటించాడు. హిందూ ధర్మశాస్త్రాలకు విరోధియని రాయ్ దూషింపబడ్డాడు. ఆయనను విద్యావంతులు, పండితులు నాస్తికునిగా పరిగణించారు. 1829 డిశంబరులో విలియం బెంటింక్, రాయ్, ద్వారకనాథ్, డేవిడ్ హేర్ మున్నగు ముఖ్యుల బలంతో సతీసహగమనమును శాసనబద్ధంగా నిషేధించాడు. 1830 జనవరిలో స్థాపించబడిన "బ్రహ్మ సమాజము"నకు పోటీగా జమీందారులు "ధర్మసభ" స్థాపించారు. "బ్రహ్మసమాజ" సభ్యులు బాల్య వివాహములు, బహు బార్యాత్వము, కుల దౌర్జన్యము, దురాచారములు రద్దు చేయ

టానికి బాగుగా కృషిసల్పారు. వాటికి మన రాయ్ నాయకత్వము వహించారు. ఆ రోజులలో సముద్రయానము చేయకూడదనే మూఢ నమ్మకాన్ని ఉల్లంగించి ఐరోపాయాత్ర సాగించిన మొట్టమొదటి భారతీయుడు మన రాయ్.

భూములనుండి లభించే ఆదాయానికి సంబంధించిన "శాశ్వత పరిష్కార చట్టం"వల్ల పేదరైతుల స్థితి దుస్సహంగా ఉన్నదని ఉద్ఘాటించి, పార్లమెంటరీ సంఘానికి సమర్పించిన సాక్ష్యంలో ఆయన యీ విధంగా సూచించాడు. "వ్యవసాయదారులు చాల దుస్థితిలో వున్నారు. వారు జమీందారుల ధన దాహానికి గురిఅయ్యారు. రాబడి పన్నులు విధించడంలో కొంత సడలింపు కనబర్చిన ప్రభుత్వం పేదరైతు విషయంలో అటువంటిది ఈ షణ్మాత్రమైనా చూపెట్టలేదు." దీనిద్వారా పేదవారిపై అతనికిగల సానుభూతి వ్యక్తమవుతూంది. రాయ్ ఏ మంచి పనిచేసినా కీర్తికాముకుడై చేయలేదు. తాను చేసిన ప్రతీపని తన కుటుంబీకుల మెప్పుపొందనందు వల్లనే ఆయన గృహ విషయాలు పట్టించుకొనేవాడుకాడు. అతని కష్టాల్లో సానుభూతి చూపిన మిత్రులు ద్వారకనాథ్ ఠాగూరు, ప్రసన్న కుమార్ ఠాగూర్‌లు మాత్రమే. భారతమాత కీర్తి ప్రతిష్ఠలు స్వదేశీ విదేశములలో వ్యాపింప జేయాలని కృషి చేసినవారిలో ప్రథముడు మన రాజారామమోహన రాయ్. అట్టి మహనీయుడు, సంఘ సంస్కర్త, విద్యావంతుడు, దేశాభిమాని అయిన మన రాయ్ 1833 సెప్టెంబరు 27 న రాత్రి 2-25 గం॥లకు కొన ఊపిరి విడిచాడు. అతని మరణం ద్వారా మన దేశం ఒక గొప్ప వ్యక్తిని పోగొట్టుకుందని చెప్పటంలో అతిశయోక్తి లేదు.

ANDHRA LOYOLA COLLEGE
LIBRARY
VIJAYAWADA

**T. M. O.** వచ్చిందేమో అని Post officeకు వెళ్తే రాలేదన్న చావుకబురు........ తాజ్‌మహల్‌కు వెళ్ళి ఒక అరకప్పు "టీ" సేవించి పద్దు చూడగానే అమాంతంగా ఒక టన్నురాయి గుండెల్లో పడింది. అక్కడనుండీ కిళ్ళీకొట్టుకు వస్తే పుస్తకమంతా Dittoలే. Economics Student నైయుండి Capstain ఎందుకాయని రేటు దింపి Elephant Packet తీసుకొని Room కు వెళుంటే మిత్రుడు 'రవి' కన్పడి 'అరేయ్ Brother' నీవు Horrible smoker వెళ్ళిపోతున్నావురా' అని Remark చేశాడు. వెంటనే "దీన్లో మజా నీకు తెలిస్తే యిలా అనవురా నేనింకా Studies begin చేయలేదని అధైర్య పడకు. Two Years Course ఈ Fifteen Days లో చదివేయవచ్చు. One half cup tea and one Packet cigarettes తో రాత్రంతా చదవచ్చు. పగలు మామూలే. మరోటి ఏమంటే mind work చేయనప్పుడు, ఒక్కటి ఊదేశావంటే నీకు కావలసినన్ని ఆలోచనలు, గంభీర భావాలు పుడతయ్" అనే చెబుతుండగానే "Brother కొంచెం పనుందిరా" అంటూ జారాడు. కాళ్ళీడ్చుకుంటూ Lodgeకి వెళుతూవుంటే, All India Radio మన పెద్దన్నయ్యలు ధరావతులు కోల్పోయారని ఢంకా కొట్టి చెపుతున్నది. ఏమిటీ చెప్మా, ఈ గాలి దుమారం అని ఆలోచిస్తూ Lodge చేరుకున్నాను.

Room అంతా ఖాళీ. మిత్రులంతా పైకంకోసం యింటికి పరుగులెత్తారు. ఇక నా సంగతి చూస్తే Ticket కోసేందుకయినా లేపురిగదా card వ్రాయడానికైనా Dry purse. రూమంతా cigartte studs. Roomను సాఫీ చేద్దామని చూస్తే Broom ఎవరో కొట్టేశారు. గత్యంతరంలేక పండుకొని ఒక cigarette వెలిగించాను. అయిపోయింది. ఇంకోటి వెలిగించి "మిత్రులు లేనప్పటికీ నీవు నాకు తోడునీడగా యుంటున్నావు. ఎవరూ రాని చోట్లకు కూడా ప్రయాస అనకుండా నీవు నాతో వస్తున్నావు, ఎన్నో పరీక్షలలో జయంపొందించావు. ఎంతో సంతోషాన్ని యిస్తున్నావు. నీకున్న ప్రేమ, దయ, విశ్వాసం ఏమని చెప్పనూ" అంటూ Cigaretteను నాలో నేను పొగుడుతూ Packet ఖాళీచేసి పడుకున్నాను.

# సిగరెట్ల కాన్ఫరెన్సు

కాకర్ల రాజేంద్రప్రసాదు
జూనియర్ ఇంటర్.

Agra Tajmahal, కలకత్తాలో Victoria Memorial Hall ను మించినట్టి Lal Mahalలో స్వదేశ, విదేశీయులు తమ రకరకాల దుసులతో, తళతళ మెఱుపులతో ఘుమఘుమ వాసనలతో ప్రవేశించారు. మామూలుగా వెడితే నన్ను రానీయరేమోనని ఒక వేషంతో ఒక మూలను కూర్చున్నాను. హాలంతా గుసగుసలు, పకపకలు, రుసరుసలు, Hydrabad నుంచి Vazir Sultan గారి దగ్గర నుంచి వచ్చిన Charminar గారు ముందుకు వచ్చి 'సోదరులారా ! (అంతా నిశ్శబ్దం) England నుంచి Churchil చే పంపబడిన Cigar గారు ముందుగా అధ్యక్షపదవి నలంకరించుతారు. అందరూ నిశ్శబ్దంగా ఉండాలని మనవి' అని చెప్పి కూర్చున్నాడు.... (అంతా నిశ్శబ్దం). వెంటనే లావుపాటి దేహంతో యున్న Cigar గారు కరతాళధ్వనుల మధ్య సువాసనలతో పీఠం అలంకరించారు.

"మిత్రులారా ! మీరింత దయతో యిచ్చిన అవకాశానికి నా అభివందనములు. ఖండఖండాంతరముల నుంచి వచ్చిన మహా పకలు వారివారి అభిప్రాయాలు. మీకు విశదపరుస్తారు. కాబట్టి నిశ్శబ్దంగా యుండాలని మనవి" అంటూ ఉండగానే, America నుంచి వచ్చిన Mr Chester field గారు ముసిముసి నగవులతో లేచి "సోదరులారా ! నాకీ సదవకాశాన్ని యిచ్చినందులకు మనఃపూర్వకాభివందనములు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితి చూచినట్లయితే మనమెందుకు పనికిమాలిన వాళ్ళముగా పరిగణింపబడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. ప్రపంచములో మనము మూలమూలలనుంచి బయటకువచ్చి పట్టణములనుంచి పల్లెవరకు వ్యాపించినాము. ఎక్కడ చూచినా మనమే. మనకు కావలసినంత స్థానబలము, భుజబలము, అర్థబలము అన్నీ ఉన్నా మనలో ఏకీ

భావము లేనందువల్ల మనకీ దుస్థితి సంభవించింది: మన శత్రువులు మనలని దగ్ధపటలం చేస్తున్నారు: మాడ్చి మసిచేసి చంపుతున్నారు. వారి నిరంకుశ త్వాన్ని నాశనం చేయాలంటే మనం ఏకీభావంతో ఉండాలి. మనకు శత్రువులైన అగ్గిపుల్లను హత మార్చేందుకు కావలసిన పైకం నేను సహాయం చేస్తాను. దాంతో ఆర్థిక దుస్థితిలోయున్న **Beedi, cigar** లను సైన్యంలో చేర్పించి పోషించవలయు నన్న ఏకాభిప్రాయము గలిగి ఎవరి శక్తికొలది వారు సహాయము చేయాలని కోరుతూ యింతటితో విర మిస్తున్నాను." (సభికుల చప్పట్లు)

అంతట **London** నుంచి వచ్చిన **Scissors**గారు తళతళ మెరుస్తున్న **17 Medels** తోను, కత్తెర మార్కు **Badge** తగిలించుకొని **stage** ఎక్కారు. "మిత్రులారా : ఈ అవకాశం నాకు కల్పించినందు లకు నా అభినందనములు. ఇంతవరకు మన మిత్రు డైన **chesterfield** గారి ఉపన్యాసం వినియున్నారు. వారు ఒట్టి అగ్గిపుల్లలను మన శత్రువులుగా పేర్కొ న్నారు. పెట్టెలుకూడా మన శత్రువులే. ఇదిలేందే అవి మనల్ని ఎదుర్కోలేవు. కాబట్టి వాటిమీదకూడా యుద్ధం ప్రకటించాలి. యిప్పుడు మనకు వట్టిసైన్యమే చాలదు. **IInd World war**లోలాగా శత్రునాశ నానికి అనేక మారణాస్త్రాలు కావాలి. భూమి పైనే గాకుండా నీటిపై, ఆకాశంపై, గూడా సంగ్రామం చేయాలి. అందువల్ల మనకు ఓడలు, విమానాలు అవసరం. కాబట్టి అందరూ ఏకీభావంతో శత్రు నాశ నానికి పూనుకోవాలని హెచ్చరిస్తూ విరమిస్తున్నాను.

అంతట **Mr Passing show** తన**Hat**ను సరు కొంటూ, సోదరులారా: నేను చెప్పవలసినది మన సోదరులూ, దేశోద్ధారకులూ చెప్పేశారు. వారు మన శత్రువులను మరచి వారికి బానిసలుగా జీవితయాత్ర కై పాటుపడే "అగ్గిపుల్ల, అగ్గిపెట్టె"ల్ని పేర్కొన్నారు. వారుజీతగాళ్ళేగాని నిజమైన శత్రువులు కారు. మనకు నిజమైన శత్రువులు మానవులు. వాళ్ళను నాశనం చెయ్యాలనే మాట మరచిపోయారు. మనం అప్రమత్తులమై యుండి, ఈ గర్వశత్రువులను నాశనం చేస్తే, తక్కిన వాళ్ళు మనల్నేమి చేస్తారు? (సభలో నిజం, నిజం అన్న కేకలు) కాబట్టి మన సృష్టి వారిమీద ప్రసరింపజేసి వారిని నాశనం చేసేం దుకు తగ్గ సహకారం చేయాలి. వెంటనే **Mr Rifle** ముందుకు వచ్చి "నేను నా **Ammunition** అంతా జరగబోయే యుద్ధానికి సప్లై చేస్తాను" అన్నాడు. **Mr Navycut** లేచి "నేను నా ఓడలు యిస్తాను. నౌకా యుద్ధంలో వాళ్ళ నాశనం కళ్ళ చూస్తాను" అన్నాడు. **Mr. Aeroplane** వచ్చి "నా విమానా లన్నీ యిస్తాను. వాటితో బాంబులవర్షం కురిపిస్తాను" అన్నాడు. **Mr Pilot** "నా సారథ్యం", **Mr. State Express, Mr. Zeep** గార్లు "రైళ్ళు, కార్లూ అన్నీ సైన్యానికి బలంగా పంపిస్తాము" అన్నారు. **Mr. Elephent, Mr. Caravan** మేమూ సహకరిస్తామన్నారు. **Mr. Lal Mahal, Mr. Golkonda, Mr. Three castles** "మా కోటలు మీకు స్వాధీనం" అన్నారు. **Mr. Deccan** "నా మైదానంమీద సైన్యాలు సమీకరించుకోం" డని అన్నాడు. ధనికవర్గాలకు చెందిన **Chesterfield, Berkeley,** 999, 777, 666, 555 గార్లు "మేము కావలసినంత పైకంగుమ్మరిస్తా" మన్నారు.

అధ్యక్షుడు **Cigar** చిఱునవ్వులోలేచి గొంతు సవ రించుకొని "సహోదరులారా : మీ పట్టువల, ఉద్రే కము, ఏకీభావం, సంఘీభావం, ధైర్య, శౌర్య, స్థైర్యములు చెప్ప నలవికానివి. మనము చేయుచున్న పనివల్ల కలిగే లాభనష్టాలు ముందు వెనుకలు యోచించి చేయాలి. యుద్ధంవల్ల వినాశమేగాని, వికాసంలేదు. మీరు చెప్పినట్లుగా శత్రువులందర్నీ సంహరించిన తర్వాత ఎవరిని మనం పరిపాలిస్తాం? (మనమే ఉండవచ్చు, మనమే వుండవచ్చునన్న కేకలు) ఆగండి....నాయనలారా ! మీరు నిన్నగాక మొన్నవచ్చిన పసికూనలు, ఆవేశంతో ఉద్రేకంతో మరేమీ యోచించటంలేదు. కలహానికి కాలుదువ్వే మా యజమాని చర్చిల్‌గారుగాంధీమహాత్ముని ముందు పల్టీ గొట్టాడు. ఆ శాంతిమూర్తి ముందు పరాజయం పొందాడు. అపరాధియైనాడు. అంటే మనశత్రు వుల్ని వదలివేయాలని నేను చెప్పడంలేదు. కాని శాంతంతో వారిని సాధించాలి. అమెరికాలోని ఆటం బాంబుకున్న శక్తికంటె మనలో అత్యధికమైన శక్తి యున్నది. మీరు గుర్తించుటలేదు. ఆటంబాంబు

వెంటనే ధ్వంసంచేస్తుంది. మనలోవున్న "నికోటిన్" వాళ్ళను పింపి, పీడించి, కృశింపచేసి బాధ పెట్టి చంపివేస్తుంది. మూడు చుక్కల నికోటిన్ ఒక కుక్కను అమాంతంగా చంపగలదు. అదే మానవులను మచ్చికచేసి మాయం చేస్తుంది. మనము వారిని ఒక్కసారి ఆకర్షిస్తే, యింకా వాళ్లు మళ్ళీ మనలను వదిలిపెట్టరు. మనం లోపలకుపోయి వారి ఊపిరితిత్తులు చెడగొట్టి క్షయరోగ పిశాచాన్ని ప్రయోగిస్తున్నాం, దాంతో మానవులు కృశించి నశించిపోతు న్నారు. మనము **Thomas Becket** లాగా చచ్చి సాధిస్తున్నాం. **Becket** చనిపోయిన తరువాత అతని ఆత్మ ఏ గాలిలోనో కలిసింది. కాని మన ఆత్మకు చావులేదు. మన ఆత్మ వారి ఊపిరితిత్తుల్లో తిష్టవేసి శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా సర్వనాశనం చేస్తున్నది. ఇకనైనా మన శక్తి మనం గ్రహించి, ముఖ్యంగా నేటి విద్యార్థులే రేపటి పౌరులు కాబట్టి మీరు వాళ్ళను బాగా ఆకర్షించి మధ్యలోనే వారిని మాయంచేయాలి. ఇక వృద్ధుల్ని మే మాకర్షిస్తాం. ఇలా, బాల్యం నుంచి వృద్ధాప్యందాకా వారిని పీల్చి పిప్పిచేసి నాశనం నేస్తాము. మన మిత్రులు **Tea, Coffee** గార్లతో సంధిచేసుకొని వారి "థీను" విష పదార్థం కూడా పంపి మనకు సహాయం చేయాలని అర్థించాలి. మన పూర్వమిత్రులు **Brandy, Whisky** మొదలగు మద్యపాన వంశీయులతోను, **Mr. Opium, Mr Snuf, Mr. Killi, Mr. Nut Powder** గార్లతోను సంధి చేసుకొని కార్య క్రమంలో మనం ముందంజ వేయాలి. "మేము దేముని ఎదుట ప్రమాణంచేసి మా కార్య క్రమంలో విశ్వాసంతో పనిచేస్తాం" అనే సరికి, అందరూ "ప్రమాణం చేద్దాం, పనిచేద్దాం" అని కేకలుపెట్టారు. ఈ కేకలకు కంగారుపడి నేను బెదురుచూపులు చూస్తుంటే నన్ను కనిపెట్టి అందరూ తలో గుద్దూ గుద్దివేసి నా ఒళ్ళు హూనంచేశారు. ఆ బాధలో, భయంలో కళ్ళువిప్పిచూస్తే సభా సభ్యులు ఒక్కళ్ళు లేరు. దగ్గు ముట్టడి వేసింది. **Cigar** గారి ప్రసంగంలో అంతరార్థం గ్రహించి వెంటనే **Broom** లేని **room** లోని **studs** ను తీసి **clean** చేసేటప్పటికి తొమ్మిదయింది. మన పూజా పునస్కారా లయ్యేసరికి **Post man T. M. O.** అందించాడు. ప్రాణం లేచివచ్చింది. ఆ పైకంతో **Cigarette**బాకీ, **Hostel**బాకీ చెల్లించి అప్పటినుంచి సిగరెట్ల జోలికిపోలేదు. ఫలితం ఏమంటే సెగల పొగలతో శల్యావశిష్టులమైన మనం నిగనిగలాడుతూ నిక్షేపంలా ఉన్నాము.

# తోకచుక్కలు - కొహెటిక్ తోకచుక్క

వి. ఎస్. నగేష్
**Jr. Inter.**

తోకచుక్కలు సూర్యకుటుంబానికి చెందినవి. అవి దీర్ఘ వృత్త కక్ష్యలలో పరిభ్రమిస్తాయి. అయితే కొన్ని పరావలయ మార్గాలలోగూడ సంచరిస్తాయి. తోకచుక్కలు మనకు అనేకమైళ్ళ దూరంలో తిరుగాడే వాయుపదార్థాలు ఇవి కోటానుకోట్ల మైళ్ళ దూరంలో ఉంటాయి. వీనిలో కొన్ని ఒకొక్కసారి కనబడి అంతరిక్షంలోకి పోయి మాయమవుతాయి. వివిధ రకాల బండరాళ్ళు, వాయువులు, ధూళి కలిసి తోకచుక్క ఏర్పడుతుంది. తోకచుక్కలో ఉన్న పదార్థం పదులు పదులుగా ఉంటుంది. ఇది ప్రప్రథమంలో తెల్లగా కన్పిస్తుంది. ఇది ఒక మేఘమువలె ఉంటుంది. దీనిని "కోమా" అంటారు. భూమికన్నా పెద్ద తోకచుక్క సైతం, బరువులో అది భూమిలో లక్ష వంతుకన్న తక్కువే ఉంటుంది. తోకలు ఎల్లప్పుడు సూర్యునికి వ్యతిరేకదిశలో విస్తరిల్లుతాయి. తోకచుక్కలు 10కోట్ల మైళ్ళవరకుగూడ వ్యాపించి యుండవచ్చు. సర్వసాధారణంగా తోకచుక్కలకు ఒకే తోక వుండటం పరిపాటి. కాని, బారెల్లి అనే తోకచుక్కకు తొమ్మిది తోకలున్నాయని శాస్త్రజ్ఞులు చెప్పారు.

కొన్ని పెద్ద పెద్ద తోకచుక్కలు చూడడానికి మనోహరంగా ఉండడమే కాక పగటివేళలో గూడ కన్పిస్తాయి. కొన్ని గ్రంథాలలో, క్రీ॥పూ॥ 146లో వచ్చిన తోకచుక్క తల సూర్యునివలె ప్రకాశవంతముగా ఉన్నట్లు వ్రాయబడినది. క్రీ॥పూ॥ 344లో వచ్చిన తోకచుక్క, మండే తారాజువ్వ లాంటి తలను కలిగి ఉందట. గ్రహాలు తిరిగినటులుగా తోకచుక్కలు ఒక సమతలంలో తిరగవు. 1889లో కనపడిన తోకచుక్క 2½ ఏండ్ల కాలము పాటు కనిపించినదట. సూర్యుని గురుత్వాకర్షణ పరిధిలో 9000 – 10,000 తోకచుక్కలు స్వైరవిహారం చేస్తున్నట్లు శాస్త్రజ్ఞులు అంచనా వేసినారు. 1066 నుండి చరిత్ర బాగుగా శోధించగా 75½ ఏండ్ల కొకమారి ఒక తోకచుక్క వచ్చుచున్నట్లు "హాలీ" దొర నిర్ణయించినాడట. అందుచే ఆ తోకచుక్కకు, హాలీ తోకచుక్క అనే పేరు పెట్టబడింది. దానితోక ఆకాశంలో మూడవ వంతు పొడుగు యుండెనట. అది ఆఖరిసారిగా 1910 మే 15న కన్పించినదట. దానితల 3,20,000 మైళ్ళ వ్యాపనం కల్గి ఉన్నట్లుగా వ్రాయబడినది. అది తిరిగి 1985లో రాగలదని శాస్త్రజ్ఞుల అంచనా. తోకచుక్కలుకనబడితే ఏదో ఒకకీడు కలుగుతుందని, మహానుభావుడైన వ్యక్తి మరణిస్తాడని నమ్మేవారు. అది కనబడినపుడల్లా ఏదో ఒక విపత్తు జరగడం వల్ల చాలమంది ప్రజలు ఇప్పటికీ ఆ విషయాన్ని నమ్ముతారు. షేక్స్పియరు మహాకవిసైతం "మహా చక్రవర్తుల, గొప్పవ్యక్తుల మరణాన్ని సూచిస్తూ ఆకాశంలో తోకచుక్క తేజస్సుతో ప్రకాశిస్తోంది" అని వ్రాసినాడు.

## కొహెటిక్ తోకచుక్క

1973 మార్చి 7 న జర్మనీలోని హంబరు భూగోళ పరిశోధనా కేంద్రంలో డాక్టరు లుదోస కొహెటిక్ అనే శాస్త్రవేత్త, ఆకాశంలో హైడ్రో నక్షత్రాల మధ్య నెమ్మదిగా సంచరిస్తున్న తోకచుక్కను గురించి ప్రపంచానికి తెలియజేశాడు. మొట్టమొదట కనిపెట్టింది ఆయనే గాబట్టి ఆయనపేర ఈ తోకచుక్క పిలువబడింది. 1972 క్రిస్టమస్ నాటినుండి ఇది ఆకాశంలో అన్ని నక్షత్రాలకన్న ప్రకాశవంతంగా గోచరించడం మొదలుపెట్టింది. ఈ తోకచుక్క సుమారు 2.2 కోట్ల కి. మీ. దగ్గర వరకు సూర్యుని వద్దకు వెళ్ళిందట. ఈ కొహెటిక్ తోకచుక్కకు 24 కి. మీ. వెడల్పైన మురికి అయిన మంచుముద్ద గల తల కలిగి వుందట, సుమారు లక్షా ఏభయివేల మైళ్ళ వ్యాసం వున్న "వాయు, ధూళి" మండలంతో ప్రకాశవంతమైన వలయం దీనిచుట్టూ వుందని శాస్త్రజ్ఞులు తెలిపారు. ఈ వలయంమీద

సౌరథార్మిక శక్తి ఒత్తిడివలన పొడవైన తోక ఏర్పడిందట.

ఈ తోకచుక్క సూర్యునికిఅతివగ్గరగా వచ్చినపుడు ఏర్పడే ఛాయవలన, సౌరకుటుంబము యొక్క యథార్థమైన పదార్థనిర్మాణాన్ని తెలుసు కోవడానికి శాస్త్రజ్ఞులు ప్రయత్నాలు చేశారు. ఈ తోకచుక్క జనవరి మొదటివారంలో గగన వీధిలో ఉజ్జ్వలకాంతులతో వెలిగి అద్భుత దృశ్యంగా విరాజిల్లింది. జనవరి నెలాఖరులో గూడ సూర్యాస్తమయం తర్వాత కనబడింది. ఫిబ్రవరిలో ఇది అంతమై పోతుందని శాస్త్రజ్ఞులు తెలిపారు. పరిభ్రమణలో ఉపగ్రహాలు, రోదసీ నౌకలు, అమెరికా ప్రయోగించిన స్కైలాబ్ యొక్క యాత్రికులు ఈతోకచుక్కను పరిశోధించారు.

# నేను - వాడు

గింజుపల్లి శ్రీరామమూర్తి
ఫైనల్ బి. యస్సీ. (E, M. P.)

ఈ తెల్లటి వెన్నెల్లో
రక్తం గడ్డకట్టే చలిలో
ఈ గోడప్రక్కన నీడలో
దారిద్రపు చిరుగుల్ని కప్పుకుని
    రాగాకుల గల గల వింటుంటే
    నా కనిపిస్తుంది, నాకంటె వాడికీ దరిద్రము ఎక్కువని
ఈ నున్నటి ఇసుకలో
ఈ సన్నటి వాన జల్లులో
ఏటి ఒడ్డున నీటి ప్రక్కన కూర్చుని
స్వేచ్ఛా స్వాతంత్ర్యాల చల్లని గాలి పీలుస్తుంటే
    నాకనిపిస్తుంది నాకంటె వాడికేం ఎక్కువని.
ఈ కొండమీద,
రాతి గుట్టమీద కూర్చుని, దూరంగా
ప్రాతఃకాల సవ్వడులందు
ఉదయించే సూర్యుణ్ణి చూస్తూ
    అనుకుంటా నాకేం తక్కువని.
ఊరికి, దూరంగా
అమావాస్య చీకట్లో
శ్మశానంలో కూర్చుని
ఎర్రని మంటల్లో, వైరాగ్యపు వాసన పీలుస్తూ
వినిపించే సన్నాయి స్వరాన్ని వింటూ
    అనుకుంటా అసలు వాడికేం తెలియదని,

# అబ్బాయా ?
# అమ్మాయా ?

సి. వెంకటసుబ్బయ్య చౌదరి
**III B. Sc**

అమ్మాయే పుడుతుంది అచ్చం అమ్మలాగే వుంటుంది_అహా : అబ్బాయే పుడతాడు అచ్చం నాన్నలాగే వుంటాడు .... ప్రశాంతంగాఉన్న పామ్ బీచ్‌లో పరవళ్ళు త్రొక్కుతున్న సముద్ర కెరటాల హోరుకు తోడుగా సుమధుర సంగీతాన్ని వినిపిస్తున్నది, రవి చేతిలోని ట్రాన్సిస్టర్. చెదురు మదురుగా కూర్చున్న యువజంటలు భవిష్యత్తులో తాముకూడ ఆ పాట పాడుకోదగ్గ దృశ్యాలను ఊహించుకుంటూ బంగారుకలలు కంటున్నారు. అందరి హృదయాలను దోచుకుంటున్న ఆ పాట రవి ప్రక్కనే కూర్చొన్న గోపి హృదయంలో చాల సంక్షోభాన్ని రేపింది. ఇదేమీ పట్టించుకోని ట్రాన్సిస్టర్ పాడుతూనే వుంది.

గోపీ ! చూశావా తమకు పుట్టబోయేది అమ్మాయని హీరో, అబ్బాయని హీరోయిను పోటీ పడుతున్నారు. ఎవరు గెలుస్తారు అన్నాడు రవి. హుం! ఒకవేళ సినిమాలో హీరో గెలిచినా నిజజీవితంలో నేను గెలవకపోవచ్చురా అని, ఆరోజే తన భార్యను మూడవ కాన్పుకై హాస్పిటల్‌లో చేర్పించిన గోపి బాధగా చెప్పాడు. ఇంతలో ట్రాన్సిస్టర్ "యింతటితో చిత్ర తరంగిణి కార్యక్రమము సమాప్తము. తరువాత కార్య ...." అంటూ ఉండగా కసిగా ఆపివేశాడు రవి. తన మిత్రుని మాటల గురించి ఆలోచిస్తూ ప్రశ్నార్థకముగా గోపి ముఖంలోకి చూశాడు రవి. ఏం లేదురా : యిప్పటికి మాకు యిద్దరూ అబ్బాయిలే కలిగారు గదా: ఈసారయినా అమ్మాయి పుడుతుందనే ఆశలేదురా అని బాధగా అన్నాడు గోపి. అందుకు బదులుగా గోపి అది మన అదృష్టము మీద ఆధారపడి ఉందిరా అన్నాడు. ఏం అదృష్టమో! మా తాతకు అందరు అబ్బాయిలే మా నాన్నకీ అందరు అబ్బాయిలే. నాక్కూడ ........ యిదంతా చూస్తుంటే మా బామ్మ చెప్పిన నాటు మాటలే నిజమనిపిస్తుంది. మా బామ్మతో ఎవరో జ్యోతిష్కుడు మా యింటివారు ఆడపడుచు అనురాగానికి నోచుకోలేదన్నాడట. ఇందుకు రవి వెంటనే విజ్ఞాన శాస్త్రము యింత అభివృద్ధి చెందిన ఈ రోజుల్లోకూడ ఆ మాటలు నమ్ముతున్నావంటే ఆశ్చర్యంగా ఉందిరా అన్నాడు. కళ్ళకు కట్టినట్లు సూటిగా కన్పడుతుండగా నమ్మక ఏం చేయను. అదీగాక మరి పుట్టబోయేది అమ్మాయో అబ్బాయో నిర్ణయించేది ఏమిటో కూడ తెలియదు. నీవు సైన్సు వాడివి గదా నాకు కొంచెం అర్థమయేలా చెప్పమని, అమాయకంగా అడిగాడు గోపి.

లింగ నిర్ణయశక్తి దేనికున్నదో విశదంగా చెప్పనారంభించాడు రవి. మన శరీరకణములలో అత్యంత ప్రముఖ పాత్ర వహిస్తున్న క్రోమోసోమ్‌లు (Chromosomes) మనలో లింగ నిర్ణయానికి బాధ్యత వహిస్తున్నాయి. మన శరీరములోని ప్రతి కణము (Cell) లోను 46 క్రోమోసోమ్‌లు ఉంటాయి. ఈ క్రోమోసోమ్‌లు జతలు జతలుగా ఉంటాయి. అనగా మన శరీర కణములో 23 జతల క్రోమోసోమ్‌లున్నాయి. వీటిలో 22 జతలను ఆటోసోము (Autosomes)లనియు, మిగిలిన ఒకజతను లైంగిక క్రోమోసోమ్‌లు లేక అల్లోసోమ్ లనియు (Sex Chromosomes or Allosomes) వర్గీకరించారు. ఆటోసోమ్‌లు మన శరీర నిర్మాణమునకు, శరీర ధర్మములకు బాధ్యత వహిస్తాయి. అల్లోసోమ్‌లు లింగ నిర్ణయంలోను, లింగ భేదములకు బాధ్యత వహిస్తాయి. ఆటోసోమ్‌లకు సంబంధించి నంతవరకు స్త్రీ పురుషులలో తేడా ఉండదు. కాని అల్లోసోమ్‌లు మాత్రం వేరుగా ఉంటాయి. స్త్రీ లోని అల్లోసోమ్‌లను X,X అనియు, పురుషుని లోని అల్లోసోమ్‌లను X,Y అని పిలుస్తారు. స్త్రీ అల్లోసోమ్‌ల జతలోని రెండు క్రోమో సోమ్‌లు ఒక దానితో ఒకటి అన్ని విధాలా పోలి ఉంటాయి. కాని పురుషునిలోని అల్లో సోమ్‌ల జతలోని రెండు క్రోమో సోమ్‌లు ఒక

దాని కొకటి వేరుగా ఉంటాయి. అందుచేతనే పురుషుని లోని అల్లోసోములను, స్త్రీ అల్లోసోములనూ XX అని కాక, XY అని పిలుస్తారు. సావధానంగా వింటున్న గోపికి X అల్లోసోమునకు Y అల్లోసోమునకుగల తేడా లేమిటో తెలుసుకోవాలని పించి అడిగాడు.

అందుకు సమాధానంగా రవి యిలా చెప్పాడు. అల్లోసోములలో రెండు రకాలయిన X కి Y కి చాలా తేడాలున్నవి. వాటిలో కొన్ని చెప్తాను. X అల్లోసోమ్ Y అల్లోసోమ్ కంటె 3 లేక 4 రెట్లు పెద్దది. ఈ రెండు అల్లోసోములు ఒక్కొక్కటి రెండు ఖండితాలుగా ఉంటాయి. ఈ రెండు అల్లోసోములలోని క్రింది ఖండితాలు ఒకేరీతిగా ఉంటాయి. కాని X అల్లోసోములోని పై ఖండితంలోని జీన్‌లు (genes) Y లో ఉండవు. Y అల్లోసోములోని పై ఖండితంలో జీన్‌లు X లో ఉండవు. ఈ అల్లోసోములే లింగ నిర్ణయంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.

ప్రత్యుత్పత్తి (Reproduction) సమయములో స్త్రీ పురుష మాతృకణములలో క్షయకరణ విభజన (Reductional division) జరిగి స్త్రీ పురుష సంయోగ బీజము లేర్పడతాయి. ఈ విధంగా ఏర్పడిన సంయోగ బీజములలో 22 ఆటోసోములు ఒక అల్లోసోమ్ ఉంటాయి. పురుష మాతృకణములో అల్లోసోములు X Y లు కావున క్షయకరణ విభజన అనంతరం ఏర్పడిన సగం సంయోగ బీజములలో X అల్లోసోమ్, మిగిలిన సగం సంయోగ బీజములలో Y అల్లోసోమ్ ఉంటుంది. కావున పురుష సంయోగ బీజములు రెండు రకములుగా ఉంటాయి. స్త్రీ మాతృ కణములోని అల్లోసోములు XX కనుక ఏర్పడిన ప్రతి స్త్రీ సంయోగ బీజం X అల్లోసోమునే కల్గి ఉంటుంది. స్త్రీ పురుష సంయోగ బీజముల మధ్య ఫలదీకరణము (Fertil·zation) జరిగిన పిదప సంయుక్త బీజం (Zygote) ఏర్పడుతుంది. దీని నీ విధంగా పట్టికలో చూపవచ్చునని యిసుకలో గీసి చూపించాడు రవి.




దీనినిబట్టి Y అల్లోసోమ్ ఉన్న పురుష సంయోగ బీజం స్త్రీ సంయోగ బీజంతో సంయోగము చెందుట వలన 44 ఆటోసోములు, XY అల్లోసోమ్ లున్న సంయుక్త బీజ మేర్పడుతుంది. యిది అబ్బాయి జన్మించడానికి దారితీస్తుంది. ఒకవేళ X అల్లోసోమ్ ఉన్న పురుష సంయోగ బీజం స్త్రీ బీజకణముతో సంయోగము చెందిన మొదట 44 ఆటోసోములు XX అల్లోసోములున్న సంయుక్త బీజం ఏర్పడుతుంది. యిది అమ్మాయి పుట్టడానికి కారణమౌతుంది. అనగా ఫలదీకరణములో పాల్గొనే పురుష సంయోగ బీజ మందున్న అల్లోసోమ్ X ఐన మొదట అమ్మాయి, Y అయితే అబ్బాయి జన్మిస్తారు. కావట్టి పురుష సంయోగ బీజ మందలి అల్లోసోమ్ లింగ నిర్ణయంలో ప్రముఖపాత్ర వహిస్తున్నది. కొంచెం విశ్రాంతి కోసం రవి సిగరెట్ వెలిగించాడు.

ఇంతలో గోపి మనస్సులో ఒక ప్రశ్న ఉదయించింది. 'రవీ : స్త్రీ గర్భం నుంచి బిడ్డ బయటకు రాక మునుపే, పుట్టబోయేది అమ్మాయో, అబ్బాయో తెలిసికో గలమా' అని అడిగాడు. 'వీలుగా' అంటూ రవి మొదలు పెట్టాడు. 'గర్భము దాల్చిన 14 నుంచి 18 వారముల లోపు స్త్రీ ఉదరం Abdomen లోకి హైపో డెర్మిక్ సూది (Hypodermic needle) ని గుచ్చి గర్భ కోశం (Womb) లోని పిండము చుట్టూ ఉన్న ఏమ్నియాటిక్ ఫ్లూయిడ్ (Amn:otic fluid) ను కొద్దిగా బయటకు తీయాలి. దీనిలో ఉన్న కణాల క్రోమోసోములను పరీక్షించి పుట్టబోయే బిడ్డ అమ్మాయనేది, అబ్బాయనేది, యింకా బిడ్డలో ఏవైనా అవలక్షణాలు ఉండేది, లేనిది కూడ చెప్పవచ్చు. ఈ పరీక్షను ఏమ్నియో సెంటెసిస్ (Amnio cente-s·s) అంటారు. బిడ్డయొక్క లింగము యిష్టము



ANDHRA LOYOLA COLLEGE
LIBRARY
VIJAYAWADA

లేకపోయినా, బిడ్డలో ఏవైనా అవలక్షణము లున్నా స్త్రీ ఆ సమయంలో సురక్షితంగా గర్భస్రావము (Abortion) చేయించుకోవచ్చు.'

'మనం కోరుకున్న విధంగా అబ్బాయిగాని, అమ్మాయిగాని పుట్టడానికి మార్గాలు లేవా' అని అడిగాడు గోపి. సిగరెట్ పారేసి గొంతు సవరించుకొని చెప్పడం మొదలు పెట్టాడు రవి. 'నీవన్నట్లు ఎంతోమంది శాస్త్రజ్ఞులు పుట్టబోయే బిడ్డ అబ్బాయిగాని, అమ్మాయిగాని మన యిష్టానుసారము కావాలని ప్రయత్నాలు చేశారు. బిడ్డ పుట్టబోయేముందుగా తల్లి ఆహారంలో మార్పులు తీసుకురావడం ద్వారాను, యింకా అనేక విధములలో తల్లిమీద ప్రయోగములు జరిపారు. అన్ని ప్రయత్నములు వ్యర్థమయినాయి. ఎక్కువ సందర్భాలలో శాస్త్రజ్ఞుల ప్రయత్నాలకు చాల ముందే పిండముయొక్క లింగనిర్ణయము జరుగుటయే ప్రధాన కారణము. ఈ విషయంలో స్త్రీ సంయోగ బీజముల మీదగాని, స్త్రీ మీదగాని ప్రయోగములు జరిపేకంటే లింగనిర్ణయంలో ప్రముఖ పాత్రధారులయిన పురుష బీజకణములమీద ప్రయోగములు జరపడం ఉత్తమం. మొదటి ప్రయోగం – కొన్ని మందులువాడి పురుష బీజకణాలలో మనకు యిష్టంలేని రకము బీజకణములను నిర్మూలించి మన యిష్టానుసారం లింగ నిర్ణయం చేయవచ్చు. రెండవది – ప్రథమ దశలో ఉన్న పిండముపై కొన్ని హార్మోనుల చర్యమూలంగా లింగ మార్పిడి జరుపవచ్చునేమో! కాని ఈ విధంగా జన్మించిన బిడ్డ అవలక్షణాలు కలివుండడానికి ఆస్కారముంది. కావున లింగ నిర్ణయము మన యిష్టానుసారం కావాలని జరిపే ప్రయోగాలను క్రోమోసోమ్‌లపై చేయడం చాల మంచిది. భవిష్యత్తులో శాస్త్రజ్ఞులు మన యిష్టానుసారం లింగ నిర్ణయం చేయగలిగే రోజు త్వరలో రావచ్చు. కాని యిది సాంఘికముగా ప్రపంచంలో అనేక సమస్యలు, మార్పులకు కారణమవచ్చు.

అంతా చెప్పిన రవి గంభీరంగా ఉన్న గోపి ముఖం చూసి 'ఏంరా అలా ఉన్నావు' అని అడిగాడు. 'ఏంలేదు ఈరోజు నాభార్య నాకు అమ్మాయినిస్తుందో అబ్బాయి నిస్తుందో అని ఆత్రంగా ఉన్నాను. అది మన చేతిలోగాని, మనము చేయగలిగేవి గాని ఏమి లేవని తెలిసికూడ, అమ్మాయి పుడితేనే బావుంటుందని అనిపిస్తుం'దని చెప్పాడు గోపి. యిది మానవ సహజమేమో అనుకుంటూ అప్పుడే వెలిగిన ట్యూబు లైట్లకేసి చూస్తున్నాడు.

'ఏరా! యిక్కడున్నారటరా. మీకోసం టీచ్ అంతా గాలిస్తున్నాను.' అన్న తన తండ్రి మాటలతో ఉలిక్కిపడ్డాడు గోపి.' 'ఇన్నాళ్ళకు నాకు మనుమరాల్ని ఎత్తుకునే భాగ్యం కలిగింది' అని సంతోషంగా చెప్పాడు గోపి తండ్రి. గోపి ముఖంలో సంతోషం కొట్టవచ్చినట్లు కన్పడుతోంది. 'నీ X అల్లోసోమ్ ప్రభావమన్నమాట' అని నవ్వుతూ అన్నాడు రవి. అమ్మాయిని చూసుకోవడానికి గోపి ఆత్రంగా కింగ్‌జార్జ్ హాస్పిటల్ వైపు ఆనందంగా అడుగులు వేశాడు తన తండ్రి, రవిలతో పాటు. అమ్మాయే పుట్టింది అచ్చం అమ్మలాగే ఉంటుంది అని మనస్సులో అనుకుంటూ నవ్వుతూ రవి వైపు చూశాడు గోపి.

# కథ కాని కథ

సురిందపల్లి విజయసారథి
బి. ఏ. ద్వితీయ

ఆకాశం మేఘావృతమై ఉంది. ఆ మేఘాల మాటున రెండు నక్షత్రాలు మెరుస్తూ కన్పిస్తున్నాయి. ఆ నక్షత్రాలకు నలువైపులా కారు మబ్బులు కమ్ముకున్నాయి. అక్కడక్కడా తెల్లని మేఘమాల చారికలులా కన్పిస్తున్నాయి. వరప్ప గంధం వస్తూవుంది రాబోయే ఉపద్రవాన్ని సూచిస్తూ. కాని, అది మండు వేసవికాలం. సమయం నాలుగు గంటలు. ఆ ఆకాశం నాలుగు గోడల మధ్య బంధింపబడి వుంది. మేఘాలు సృష్టింపబడుతున్నాయి — ఖరీదైన ఇంపోర్టెడ్ సిగరెట్ నుంచి. వాని వెనుక ప్రకాశిస్తున్న నక్షత్రాలు నేత్రద్వయం. వానికి నలువైపులా క్రమ్ముకున్న కారు మబ్బు కేశపాశం. అక్కడక్కడా కన్పించే తెల్లని మేఘ ఖండముల చారికలు నెరసిన వెంట్రుకలు. వరప్ప పరిమళము సిగరెట్టు ధూమ గంధమును పోల్చుచున్నది. జుత్తు కాటుకలా మెరుస్తున్నా అక్కడక్కడా నెరిసిన వెంట్రుకలు మెరుస్తూ కన్పిస్తున్నాయి వర్షాకాలంలో తటుక్కున మెరిసి మాయమయ్యే వంకర మెరుపుల్లా. వయస్సింక చెప్పకనే చెప్పవచ్చును.

ఈజీ చైర్‌లో మేనువాల్చి ఎదురుగావున్న టేబిల్ మీద కాళ్ళుంచి, ఊరువులమీద ఫోటో ఆల్బమ్‌ను ఉంచుకొని ఒక్కొక్క పేజీ తిరగవేస్తూ, పక్కనున్న అద్దంవైపు ముఖం త్రిప్పి చూసి, వయస్సు ప్రభావానికి సన్నగా నవ్వుకొంటున్నాడు లాయర్ రాజశేఖరంగారు. ఏ ముఖంలో ఏముంది? ఎబిస్ ఏజ్! నా వంక చూడు. ట్వెంటీ టు ఫిఫ్టీ!! అని హెచ్చరించింది చేతుల్లో వున్న ఆల్బమ్. 'ఓకే' అనుకొని పేజీలు త్రిప్పుతున్నాడు. ఒక పేజీ తిరగడం మానేసింది. ఇరవై రెండేళ్ళ చిలిపి కుర్రాడు, చూస్తున్నాడు కిల్లాడి చిలిపి చూపుల తూపులు విసురుతూ. అప్పుడు రాజశేఖరం గారి ముఖంలోని ఆనందాతిరేక అస్పష భావాలు వర్ణించాలంటే, ఉపమలు మహాకవి కలానికి కూడ లొంగిరావు. అతడెవడోకాదు, మగవాడి వేషంలో వున్న కరికి, ఇంగ్లీషు యువతి, తన ప్రేయసి. మనవాళ్ళకేం తెలుసు లవ్ ఎఫైర్స్ అనడానికి వీలులేదు. ముప్ఫై యేండ్లక్రితం యువకుడు కదా మరి! ఆ యువతి మన్నీ. ఒక నిర్ణీత కాలంవరకు ఈమన్ని మురిపించి మరపించి చివరకు గుడ్‌బై చెప్పి వెళ్ళిపోయింది స్వదేశం, ఈయన్ని – గాఢాంధకార జలధిలో ముంచివేసి! తాను కసిరి విసిరికొట్టిన తన మరదలే చివరకు మనస్సు బుదుపుదీర్చి, ఆనందాన్ని చేకూర్చి,– జీవిత కుసుమాల పాన్పుపై మకరందాన్ని చిందించి ఆనంద సీమల్లో ఆటలాడించి అనతి కాలంలోనే అనంత లోకాలకు వెళ్ళిపోయింది, అనంత్‌కు ఆత్మనిచ్చి.

రాజశేఖరంగారి ఏకైక పుత్రుడు అనంత్ అర్జెంటుగా టి. ఎమ్. ఓ. (T. M. O.) పంపమని టెలిగ్రాం యిచ్చాడు– ఆంధ్రా లయోలా కాలేజి హాస్టల్‌నుంచి. ఇదీవిషయం రాజశేఖరంగారు విసుగా బయటికెడితే పోస్ట్‌మాన్ తెచ్చిన టెలిగ్రాం కవరిచ్చిన సాక్ష్యం! తన కొడుకు తనకులాగా దురవృషవంతుడు, అపరిమిత మనస్కుడు కాకూడదని ఆయన ఆశ! అది నెరవేరే దెంతవరకో! అని అనుకొంటూండగానే నౌకరు ఆ రోజు వచ్చిన ఉత్తరాలు తెచ్చి యిచ్చాడు. అందులో చూడగానే ఆకర్షించింది ఒంగు కవరు. పూర్వానుభవం కదూ! ఇదేదో ప్రేమలేఖలా వుంది అనుకొంటూ చింపి చూస్తూ ఆశ్చర్యచకితుడయ్యాడు. అది అనంత్ దస్తూరితో అతడి మేనమామగారిని సంబోధించి వుంది – "మామయ్యకు! మీ ఉత్తరం ఈ రోజే అందింది. మీ కలాంటి ఉద్దేశ్యం ఉన్నట్లు నాకు ఈ క్షణంవరకు తెలియదు. నేనిలా వ్రాస్తున్నందుకు మరోలా భావించవద్దు. నేను శాంతి ఒకే ఈడువాళ్ళం. కాని ఆమెకు నా జీవితంలో సగభాగం యివ్వాలని నేనెప్పుడూ తలంచలేదు. చిన్నప్పటి నుంచి ఒకచోట తిరిగి, ఒకచోట పెరిగి పెద్దవాళ్ళమైనాం. మాలో ఎలాంటి భావం కలుగలేదు. ఇద్దరం కలిసి తిన్నాం. శాంతిని నాకు చెల్లెలివంటిదిగా భావించానేగాని మరోలా ఎన్నడూ ఊహించ

లేదు. అలాగే శాంతికి నా మీద ఎలాంటి అభిప్రాయ ముందో తెలుసుకున్నారా? లేదు. పెద్దవాళ్ళు మీకా అవసరంలేదు. అంతా మీ యిష్టమే! ఇప్పటి సమాజంలో కూడ మీలాంటి వాళ్ళున్నందుకు నేనెంతో విచారిస్తున్నాను. ఇప్పుడే నాన్నగారికి – ఉత్తరం రాస్తున్నాను. శాంతిని అడిగినట్లు చెప్పగలరు. ఆమెను నాకో లెటరు రాయవలసిందిగా చెప్పగలరు.

నమస్కారములతో

అనంత్"

రాజశేఖరంగారి కన్నులు కెంపులయ్యాయి. తనే దైతే జరుగకూడదను కుంటున్నాడో అదే జరుగుతోంది. అంతప్పుడు తనూ యిలాగే చేశాడు. నిజంగా రామచంద్రం (తన బావమరిది) అలా చేయడు. రాస్తే తనకే రాస్తాడు గాని ప్రాధేయపడి మేనల్లుడికి – రాసేంత అభిమానం లేని మనిషికాదు. నాకు వీడు ఏదో ప్లాన్‌తో నాకు రాసినట్లున్నాడు. అంటే వీడి దృష్టిలో మరెవ్వరో వున్నారని సూటిగా గాకపోయినా చాటుగానైనా తెలియజెయ్యడ మన్నమాట. ఇలా రాజశేఖరం గారి మెదడు అనబడే కోర్టులో వివాదం జరుగుతోంది. తల వేడెక్కిపోయింది. లేచి వెళ్ళి ముఖం కడుక్కొని వచ్చి కళ్ళలోని ఉగ్రరేఖలు కాస్త తగ్గించుకొని స్తిమితపడ్డారు. శాంతి తన యింటి కోడలు కావాలని ఎంతగానో ఆశలు పెంచుకుంటే కల్లు త్రాగిన కోతిలా ప్రవర్తిస్తాడా వీడు? అవును. పోలికలెక్కడనుంచో రావు. ప్రక్కనున్న లెటర్ పాడ్ తీసికొని దానిలో ఏవో పది ఇంగ్లీషు మాటలు వ్రాశాడు రాజశేఖరంగారు.

* * *

కాలేజీ హాస్టల్‌లోని తన రూమ్ మేట్సుతో బాతాఖానీ వేసుక్కూర్చున్నాడు అనంత్. టెలిగ్రాం వచ్చిందని ఎవరో కబురు పెట్టేసరికి మతిపోయినంత పనై చిందులు త్రొక్కుతున్నాడు. టి. ఎమ్. ఒ. పంపమంటే టెలిగ్రాం యివ్వడమేమిటా అని మస్తిష్కం అమావాస్యనాటి ఆకాశమైంది ఆలోచనలనబడే చుక్కలతో. సహజంగా గంభీరమైనవాడు ఇలా అయిపోయాడేవిటా అని స్నేహితులంతా దిగాలుపడి చూస్తున్నారు. ఎలాగో వెళ్ళి టెలిగ్రాం కవరు చేతపట్టుకొని అనంత్ రూంలోకి మామూలుగా వచ్చి కూర్చునేసరికి ప్రాణం కుదుటపడింది వాళ్ళకి. "అర్జంటుగా ఇంటికి రమ్మని రాశాడు మా నాన్న. వార్డెన్ పర్మిషన్ తీసికొని ఈ సాయంత్రమే వెళ్తాను" అని చెప్పాడు యాంత్రికంగా స్నేహితులకు.

* * *

వాలు కుర్చీలో వెనుకకు వాలి కిటికీలోంచి బయటకు చూస్తూవుంటే వేడిగాలి ముఖానికి తగిలి, చదువుతున్న ఇంగ్లీషు నవలని అడ్డుగా పెట్టుకున్నాడు అనంత్. ఒక బలిష్టమైన హస్తం తన జుత్తును లాలనగా నిమురుతోంది. చల్లదనాన్ని అనుభవిస్తూ ప్రేమ ప్రవాహంలోకరిగినీరై, పరవశంగా "నాన్నా" అన్నాడు అనంత్. పారవశ్యంగా అన్నమాట సరిగా వెలువడలేదు. ఆ వాత్సల్యపూరిత చేష్ట కలిగించే ఆనందం అనుభూతి ఎలాంటిదో అనంత్‌కు తెలిసింది అదే మొదటిసారి, తన పందొమ్మిదేండ్ల జీవితంలో! అనంత్‌కు ఏమి మాట్లాడాలో తెలియలేదు. రాజశేఖరంగారే ప్రారంభించారు. "బాబూ అనంత్! నేను నిన్ను ఎందుకుపిలిపించానో అడగనేలేదేం. అది చాల ముఖ్యమైన విషయం. ఊఁ .. అదలాఉంచు. మీకు పరీక్షలింకా నెలరోజులేకదా వుంది? ఛ....ఎటూకాని రోజులు. ఈ ఎండాకాలంలో ఏవిటో వెధవ పరీక్షలు. బాగా చదువుతున్నావా? వేరే విషయాల మీదకు మనస్సు మరల్చకు. అన్నట్టు మామయ్యావాళ్ల నుండి నీకప్పుడప్పుడు లెటర్స్‌మైనా వస్తుంటాయా?" పరిశీలనగా అడిగారు. "అవును నాన్నా! చాలా అరుదుగా రాస్తూంటారు. మొన్ననే రాశారు అదోలా. తగినట్లుగానే సమాధానం రాశాను. ఊఁ...మీకు కూడ రాశానుగా?" అనంత్ సమాధానం.

"అనంత్! వయస్సు వస్తూందిరా! నువ్ చిన్న పిల్లవాడివి కావటం లేదు ఎందుకలా అబద్ధమాడతావ్? నిజం చెప్పు. మామయ్యకా నాకా నువ్ సమాధానం రాసింది?" రాజశేఖరంగారు ప్రశ్నించారు. "ఇద్దరికీ రాశాను" అనంత్ సమాధానం.

"అయితే నేనొక టడుగుతాను సూటిగా సమాధానం చెప్పు. శాంతి మీద నీ అభిప్రాయ మేమిటి? పాప మది నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకుందిరా! మీ

యిద్దరి పెళ్ళి విషయాలన్నీ మీ చిన్నప్పుడే మేం మాట్లాడుకున్నాం. అది ఏనాటికైనా ఈ యింటి కోడలు కావాల్సిందే. అనంత్ ! నీ అభిప్రాయ మేమిటో చెప్పు!'' అడిగాడు రాజశేఖరంగారు. "నా అభిప్రాయంతో మీకేం పని ? అన్నీ మీరే చూచు కొంటారుగా. పొత్తుకుదరని గిత్తల్ని ఒకే కాడి క్రింద బలవంతంగా కట్టడం మీ పెద్దవాళ్ళ కలవాటేగా? ఆ బండి ఎలాగైనా నడవనీ, మీకేం బాధ్యతలేదు. వెనుక నుంచి చూస్తారు .... బండి సాఫీగానే పోతుందని అపోహ పడతారు. ముందు చూపు వుంటే గదా, అసలు విషయం తెలిసేది," బాధగా అన్నాడు అనంత్.

''అయితే ఇంతకి నువ్ చెప్పొచ్చే దేవిటిరా ?'' కోపంగా విసుగ్గా అన్నారు రాజశేఖరంగారు.

"నిజంగా శాంతి అభిప్రాయం మీరు తెలుసుకున్నారా ? లేదు. ఎప్పుడూ మీ తొందర మీదే'' అన్నాడు అనంత్.

''ఏం ...నీ ఏడుపే అదీ ఏడుస్తోందా ? ఆడదానికి దానికైనా సిగ్గుండఖర్లా ! సొంత బావ నొదిలి పెట్టి'' ఆవేశంగా ఇంకా ఏదో అనబోయేంతలో— అనంత్ అడ్డుతగిలి "నాన్నగారూ ! ఆవేశపడకండి. ఆమెకు మాత్రం స్వేచ్ఛలేదా ?" ముఖం చిట్లించాడు.

"చూడు అనంత్! ఇందుకే నిన్ను పిలిపించింది. వయస్సు వస్తున్న కొద్దీ మనసు కోతిదవుతుంది. ఎటుబడితే అటు గెంతుతుంది. నువ్వుతప్ప నాకింకెవరు ఈ లోకంలో చెప్పు. సర్వదా నీ శ్రేయస్సే కదా కోరుకునేది. వయస్సు మహా చెడ్డది. తొందరపడి ఏ నిర్ణయానికి రాకూడదు. ఉద్రేకంలో తీసికొనే నిర్ణయం ప్రతిదీ తప్పనిసరిగా చెడుకే దారి తీస్తుంది. జీవితాన్ని కాచి ఒడబోసిన అనుభవంతో చెబుతున్నాను. పెద్దలమాట లక్ష్య పెట్టకపోతే పతనం తప్పదు. యవ్వనపు పొంగులో పెద్దలమాట నేను లక్ష్యపెట్టకే నా జీవితాన్ని పాడుచేసుకున్నాను. నా మాట విను. పెద్దలెప్పుడూ బిడ్డల శ్రేయస్సు కోరతాం. మా తహతహ మీకు హాస్యాస్పదంగా కన్పిస్తుంది. చల్లగా ఆలోచించి ఒక నిర్ణయానికిరా" సానునయంగా చెప్పారు రాజశేఖరంగారు. తనలా తన కొడుకుకూడా నష్టజాతకుడు కాకూడదని ఆయన తహతహ. మధ్యాహ్నం గడిచిపోయింది. సాయంత్రం ఎండ తీవ్రతతగ్గి భూమి కాస్త చల్లబడింది.

* * *

అనంత్ గేటు దగ్గరకు వస్తూనే ఆగిపోయాడు. తోటలో తనమరదలు శాంతి పూలుకోస్తూ కన్పించింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. పిల్లిలా చాటుగావెళ్ళి కళ్ళుమూసి "ఎవరో కనుక్కో-చూద్దాం" అన్నాడు. మరి దగ్గరితనాన్ని మరచి పోలేరుగా హఠాత్సమావేశంలో . వనారై ఎ

'అనంత్' అని మాత్రం అనగలిగింది శాంతి. అనంత్ విసుబోయాడు. ఆమె కళ్ళలో పలుకరింపు లేదు. వెనుకటి లాలన లేదు. బావ అనేది తనను పేరుతో పిలిచిందేమిటి? ఆ కళ్ళలో ఆందోళనేమిటి? అనంత్ మనసులో అనుమానఆశ్చర్యాలు గజిబిజిగా గూడు అల్లుకున్నాయి. శాంతి 'బావా' అని పిలిచేటప్పటికి ఈలోకంలోకి వచ్చాడు ఆలోచనల వలయంలోంచి. శాంతి తనే మొదలుబెట్టింది...."ఏం బావా ? ఎందుకలా పొరపాటు చేశావ్ ? ఏదో మా నాన్న నీకలా రాశాడనుకో. దానిని అంత యిదిగా తీసికొని చర్చించి, నీఅభిప్రాయాలు, నిర్ణయాలు మామయ్యకు రాయాలా పసివాడిలా ?! మరి పొరపాటున కవర్లు మారాయో ఏమో అది మాకు చేరింది. మా నాన్న నిప్పులమీద కూర్చున్నాడు. నాకు ఆందోళనగాను, భయంగాను వుంది. నాఉద్దేశం నీకెప్పుడో చెప్పాను. ఇక నా జీవితానికి ఏదైనా ఒక దారి చూపే బాధ్యత నీమీద వేసుకోలేవా బావా ?" దీనంగా చూసింది శాంతి. అనంత్ హృదయం జాలితో నిండి పోయింది."శాంతీ! బేలవై పోకు. నీకంటె నాకెవరు? చెప్పు. నీకు ఏ ఆపద రానీయను. నీకు బావగా అది నా విధి.సూటిగాచెప్పు.నువ్ నన్ను బావగా ఆదరించి గౌరవిస్తావుగాని భర్తగాచూడలేవు. అవునా ?అలాగే నిన్ను నాకు మరదలిగా ప్రేమిస్తానే గాని మరోలా కోరుకోను. ఇందులో మనిద్దరి భావాలు సరిపోయాయి. ఇంకా నీకొచ్చిన భయం ఏమిటి? నువ్వెవరినైనా ప్రేమించావా? సిగ్గు పడకుండా చెప్పు. నేను ఏమీ అనుకోను.

అతడిని తెచ్చి నీ కొంగున ముడివేసి నా బాధ్యత నెర వేరుస్తాను. నామాట నమ్ము శాంతీ! ఇదిగో హామీ" అంటూ చేతిలో చెయ్యివేసి గంభీరంగా నిల్చున్నాడు.

"బావా, నీలాంటి అమృత హృదయుడికి నేనెలా కృతజ్ఞత చెప్పడం" అంటూ అతడి చేతిని తన కళ్ళకు అద్దుకుంది. కళ్ళవెంట ఆనంద బాష్పాలు రాలాయి.

అతడి చేతిలో ఎడ్రెస్ కార్డు వుంచింది. "శాంతీ! రాబర్ట్!! ఎగ్నెస్ బద్రరిన్లా రాబర్ట్‌నా నువ్వు....?!?" మతి చలించినంతపనై గొణిగాడు అనంత్. 'అవును' అన్నట్లు తల ఊపి సిగ్గుతో కనురెప్పలు వాల్చి కాలి బొటనవ్రేలు నేలమీద గీస్తూ నిల్చుంది. "బంగారం ముద్దనే వలలోవేసికొన్నావే.మరి ఎగ్నెస్ ఈవిషయం నాకెప్పుడూ చెప్పనేలేదేం?!" అని, కనిపెట్టేసిందేమో నని నాలుక కొరుక్కున్నాడు. కిసుక్కున నవ్వింది శాంతి. "ఏయ్ ఎందుకు నవ్వుతావ్!" కోపం నటించాడు. "ఏమీ లేదు. నాకు ఎగ్నెస్ గుర్తుకొచ్చింది" అంది శాంతి నవ్వాపుకొంటూ. "ఇదిగో ఎగతాళి పట్టించకు. అయితే ఎగ్నెస్ ఎవరో నీకు తెలుసా?" అన్నాడు ప్రశ్నార్థకంగా. "నాకు తెలుసు. నాకు అక్క....మరి....నీకు ఏంజెల్" అంటూ నవ్వేసింది శాంతి.

* * *

"ఇంకా తాత్సారం దేనికి? ఆమె కులం, మతం, జాతికూడ చెబితే పోదూ? టెల్ మీ ఫ్రాంక్లీ" కాస్త నిష్ఠూరంగా, కర్కశంగా అన్నారు రాజశేఖరం గారు లా బుక్‌లో నించి ముఖం ప్రక్కకు త్రిప్పి. "మనకులా లెక్కకు మించి కులాలు, జాతులు, మతాలు, అభిమతాలు వాళ్ళకేం లేవు, కాబట్టి మీ రడిగిన పర్టిక్యులర్స్ ఆమెను గురించి నేనేం చెప్ప లేను. విషయం చెబుతున్నా వినండి నాన్నా; ఆ అమ్మాయి ఆంగ్లో ఇండియన్ యువతి, అంతకు మించి చెప్పడానికేంకేం లేదు. అయామ్ హర్ వోన్ ఆమె దృష్టిలో, అంతే" అన్నాడు దృఢంగా అనంత్.

"అదేజాతి.... అదేజాతి..." అనే మాట రాజ శేఖరంగారి మనస్సులో సుడులు తిరిగి కలవరం రేపింది. "అనంత్....!" అని గర్జించి 'లా' బుక్ టేబిల్‌మీద పిచ్చిగా మోదాడు ఉన్మాదిలా మారిపోయి లాయర్ రాజశేఖరంగారు. గది ప్రతిధ్వనించింది. దిగున నిద్రలేచాను. నా తల దగ్గర ఒకటే గోల. టేబిల్ మ్రోగిస్తున్నాడు నన్ను నిద్రలెమ్మని. ఒహో! ఇదంతా కలా! ఛీ స్టుపిడ్! మంచి సస్పెన్స్‌లో కల చెదర గొట్టావ్ అని వాణ్ణి విసుక్కున్నాను. ఆ రోజు ఉదయమంతా "జీవితం" అనే విషయం మీద డిస్కస్ చేశాం. ముసలితనాన్ని గురించి ఊహలు చేశాం. ఒకటిన్నరకు నిద్ర కుపక్రమించి ఐదున్నరకు (నిద్ర) లేచానన్నమాట. ఈ లోపుగా నే నిదంతా ఎక్స్‌పీరియన్స్ చేశానా, కలలో?! కలలో నేనెంత ముసలివాణ్ణి! లాయర్ రాజశేఖరాన్ని!! ఒహ్‌! ఇది కలకాదు. కథ! కథకూడ కాదు. కథ కాని కథ!!

# మీకు తెలుసా?

పి. నాగార్జునరావు
ఇంటర్ II

సాధారణంగా మనం సర్కస్‌లో ఎన్నో వింతలు చూస్తూ ఉంటాం. అందులో కొన్ని ఫీట్లు మరీ ఆశ్చర్యకరంగా ఉంటాయి. సైకిల్ మీద లూపు చుట్టూ తిరిగి రావటం ఇలాటి వాటిలో ఒకటి. ఈ ఫీట్‌ని చూసి చదువురాని సామాన్య ప్రజలు నోటి మీద వేలేసుకుని మరీ ఆశ్చర్యం వెళ్ళబుచ్చుతారు. అంతవరకు ఎందుకులెండి కాస్తో కూస్తో భౌతిక శాస్త్రంతో పరిచయం ఉన్నవాళ్ళు తప్పితే మనలో చాలామందికి ఆశ్చర్యకరంగానే తోస్తుంది.

అదలా ఉంచి అసలు విషయానికి వద్దాం. అసలీ ఫీట్‌ని మొట్టమొదటిసారిగా డయాబోలో, మెఫిస్టో అనే ఇద్దరు సర్కస్‌వాళ్ళు కనుగొన్నారట ఈ శతాబ్దపు తొలి సంవత్సరాల్లో.

టూకీగా ఈ ఫీటేమిటంటే కొంత ఎతులో సైకిల్ మీద బయలుదేరిన వ్యక్తి వెడల్పాటి పట్టీ (చెక్కతో చేసింది కావచ్చు) మీదుగా క్రమంగా వాలుగ క్రిందకు దిగి, అక్కడి నుండి పైకి ఓ వలయాన్ని చుట్టి తిరిగి క్షేమంగా క్రింది భాగానికి వస్తాడు. ఈ ఫీట్ మొత్తంలో ఎవరికయినా కలిగే సందేహం ఒకటే. వలయం పై భాగాన తలక్రిందులుగా, పడిపోకుండా ఆ వ్యక్తి సైకిల్ ఎలా నడుపగలడు? అని.

అసలీ ఫీటుకు ముఖ్యమైనది సైకిల్ ప్రారంభ స్థానం ఎంత ఎత్తులో ఉండాలి అనేది మాత్రమే.

కొంత ఎత్తునుండి బయలుదేరిన పట్టీ వాలుగా క్రిందికి దిగి వలయంగా చుట్టుకొంటుంది కదా! ఆ వలయం యొక్క వ్యాసార్థం 'r' అనుకుంటే, సైకిల్ ప్రారంభస్థానం లూపు వ్యాసార్థానికి రెండున్నర రెట్లు కన్న ఎక్కువగా ఉండాలి.

ఈ విషయాన్నే మరికాస్త విపులంగా చర్చిద్దాం. మెకానిక్స్ సూత్రాల ప్రకారం ఆలోచిస్తే, సైకిల్ స్టారింగ్ పాయింట్ నుండి వాలుగ క్రిందికి దిగుతున్నప్పుడు, భూమి నుండి లూపు ఎత్తు ఎంత ఉంటుందో (2r) సరిగా అంత ఎత్తులో ఉన్నప్పుడు సైకిలు వేగం లూపు వలయంలో గరిష్ఠపు ఎత్తులో తలక్రిందులుగా ఉన్నప్పటి వేగానికి సమానము. ఆ వేగము V అనుకుంటే $V = \sqrt{2gx}$ అవుతుంది. ఇక్కడ g గురుత్వాకర్షణ వేగవృద్ధి, x లూపు వ్యాసానికి (2r) స్టారింగ్ పాయింట్ ఎత్తుకి ఉండవలసిన తేడా అవుతాయి. ఈ వేగంతో సైకిల్ లూపు పై భాగాన తల క్రిందులుగా పోతున్నప్పుడు పడిపోకుండా ఉండాలంటే లూపు కేంద్రంనుండి వెలుపలికి అంటే పైవైపుకి పనిచేసే కేంద్ర పరాన్ముఖ వేగవృద్ధి $\left(\frac{v^2}{r}\right)$ క్రిందికి పనిచేసే గురుత్వాకర్షణ వేగవృద్ధి (g)ని మించిఉండాలి.

అంటే $\frac{v^2}{r} > g$ లేక $v^2 > gr$ కాని $v^2 = 2gx$ అని మనకు తెలియును. కాబట్టి $2gx > gr$ లేక $2x > r$ లేక $x > \frac{r}{2}$

దీనినిబట్టి ఫీట్ విజయవంతంగా చేసి మనిషి సురక్షితంగా క్రిందికి రావాలంటే లూపు వ్యాసార్థం 'r'కు రెండున్నర రెట్లుకన్నా ఎక్కువ ఎత్తులో సైకిల్ బయలుదేరాలి. కాని ఎంతవాలుతో బయలుదేరాలన్నది అంత ముఖ్యం కాదు. అంతేకాకుండా సైకిల్ చెయిన్ తీసివేసి సైకిల్ వేగానికి ఘర్షణ బలనిరోధం లేకుండా చూడాలి.

కాని అన్నిటికన్నా అతి ముఖ్యమైంది మరొకటుంది. సైకిల్‌పై వ్యక్తి చేతులు వణికి, బార్‌ని అటూ ఇటూ త్రిప్పితేమాత్రం పైనచెప్పిన సూత్రాలకు బాధ్యత (Responsibility) ఏమీలేదు.

ఈ సారి ఒక చిన్న లెక్క చెయ్యగలమేమో చూద్దాం. ముందు లెక్కేమిటో తెలుసుకోవాలికదా!

ఓ ముప్పై గ్లాసులనీరు పట్టే పాత్రలోనికి నిండుగా నీరు తీసుకొని, దాని అడుగు భాగాన (bottom) ఉన్న చిన్నగొట్టాన్ని తెరిచి మనము పైన చెప్పుకున్న గ్లాసులోనికి నీరు పడుతున్నామనుకోండి. ఒక గ్లాసు పూర్తిగా నీటితో నిండటా

నికి ఒక నిముషం పడితే, పై పాత్ర ఖాళీ అయ్యేందుకు ఎంత కాలం తీసికుంటుంది?

ఆఫరాల్ ఈ చిన్న లెక్క చెయ్యటానికి మేమేమీ ఎలిమెంటరీ స్కూల్ స్టూడెంట్స్ కాదు అని మీరనవచ్చు. సరిగా అర్థం చేసికుంటే అనకనూ పోవచ్చు. ఏది ఏమైనప్పటికీ ఇది మరీ మీరనుకునేటంత సులభం కాదు. (అంటే 30 × 1ని = 30 ని॥ మాత్రం కాదు.)

ముందు చెప్పకుండా సడన్‌గా ఈ ప్రశ్న ఎవరి మీదయినా ప్రయోగిస్తే సాధారణంగా పైన చెప్పిన జవాబే వస్తుంది. కాని జాగ్రత్తగా ఆలోచిస్తే 60 నిముషాలు, అంటే ఒక గంట పడుతుంది. అంటే పాత్రలోని నీటి మట్టం తరక్కుండా ముప్పై గ్లాసుల నీటిని వెలుపలికి తీయటానికి రెట్టింపు కాలం పడుతుంది. ఎందు చేత?.... ఇదేమీ అతి కష్టమైన విషయం కాదు .... పైగా చాల సామాన్యమైనది కూడ .... ఆలోచించండి.

ఒకొక్క గ్లాసు నీరు బయటకు పోయేకొద్దీ పాత్రలో నీటి మట్టం తగ్గుతుంది. అందువలన గొట్టం నుంచి బయటకు వచ్చే నీటిపై పీడనం తగ్గటం వలన, నీరు బయటకు వచ్చే వేగం తగ్గుతుంది. కనుక గ్లాసు నిండటానికి మొదట కంటే ఎక్కువ కాలం పడుతుంది. గొట్టంనుండి నీరు వచ్చే వేగం v, గురుత్వాకర్షణ వేగవృద్ధి 'g' మీదను మరియు, పాత్రలోని నీటి మట్టం ఎత్తు h మీదను ఆధారపడి ఉంటుంది.

$$V = \sqrt{2gh}$$

పై సూత్ర ప్రకారం h విలువ తగ్గే కొలది వేగం తగ్గి గ్లాసు నిండటానికి ఎక్కువ సమయం పడుతుంది.

ఉదాహరణ పూర్వకంగా చర్చిస్తే బాగా అర్థమవుతుంది.

మొట్టమొదట పాత్రలో నీటిమట్టం 'h' ఉందనుకుందాం. అపుడు నీరు వెలుపలికి వచ్చే వేగం

$$V_1 = \sqrt{2gh}$$

కాని పాత్రలో నీటి మట్టము, $\frac{h}{2}$ అయితే

$$V_2 = \sqrt{\frac{2gh}{2}} = \sqrt{\frac{2gh}{1.414}}$$

అట్లే నీటి మట్టం $\frac{h}{4}$ అయితే

$$V_3 = \sqrt{\frac{2gh}{4}} = \frac{\sqrt{2gh}}{2}$$

అలాగే నీటి మట్టం $\frac{h}{9}$ కి తగ్గినపుడు

$$V_4 = \sqrt{\frac{2gh}{9}} = \frac{\sqrt{2gh}}{3}$$

పాత్రలోని నీటిమట్టం 1, $\frac{1}{2}$, $\frac{1}{4}$, $\frac{1}{9}$ నిష్పత్తులలో ఉన్నపుడు నీటి వేగం క్రమంగా 1, $\frac{1}{1.414}$, $\frac{1}{2}$, $\frac{1}{3}$ లుగా నున్నవి. వేగాలకు ఉత్క్రమ విలువే (reciprocal) ఆయా వేగాలవద్ద గ్లాసు నింపడానికి పట్టే కాలం అవుతుంది. అంటే పై ఉదాహరణలో గ్లాసు నిండటానికి పట్టే కాలం 1 : 1.414 : 2 : 3 అనే క్రమంలో పెరుగుతుంది.

ఈ ప్రయోగాన్ని చెయ్యగలిగే ఓపిక ఉన్న వాళ్లెవరయినా ఇంట్లో చేసి చూడవచ్చు. కాని చిన్న తరగతుల్లో ఉన్న మీ తమ్ముడుగాని చెల్లాయిగానీ ఇలాటి లెక్క పట్టుకొచ్చి 'ఇది చేయటం ఎలారా అన్నయ్యా' అని అడిగితే మాత్రం ఇదంతా గుక్క తిప్పుకోకుండా ఏకరువుపెట్టి వాళ్ళను బెదరగొట్టకండి.

[నిత్యజీవితంలో భౌతికశాస్త్రం నుండి]

★

# చేదు నిజం

పి. రమేష్ బాబు
ఇంటర్ II

తెల్లవారు ఝామున నాలుగున్నరైంది. శీతాకాలమేమో ఇంకా ఎక్కడా వెలుగురేఖ కనపడటం లేదు. అర్ధరాత్రయినట్లుంది. నిద్రపోతున్న ప్రభాకర్‌కు తలుపు తట్టిన శబ్దానికి మెలకువ వచ్చింది. అయినా లేవబుద్ధి కాలేదతనికి చలికి. బెడ్‌లైటు మసకవెలుగులో టైమ్ చూసుకొన్నాడు.

మళ్ళీ మరోసారి వినిపించిందదే శబ్దము. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని లేచి వెళ్ళి తలుపుతీశాడు. టెలిగ్రామ్ ! .... "టెలిగ్రామ్ ఇవ్వాల్సినంత అవసరమెవరికొచ్చిందా ?" అనుకొంటూనే సంతకంచేసి టెలిగ్రామ్ తీసికొని చదువుకొన్నాడు.

మొదట వివర్ణమైన అతని వదనంలో మరుక్షణంలో చిరుదరహాసరేఖ మెరిసింది. అప్పుడే మెలకువ వచ్చి ముందు గదిలోకి వచ్చిన రాధ అతని మౌనాన్ని భరించలేక "ఏమిటండీ" ఎక్కడినుండి ? అని ఆత్రుతతో అడిగింది. మారు మాట్లాడకుండ అందించాడామెకు ఆ ఎర్ర కాయితాన్ని ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా.

ఆత్రుతతో చదివిన ఆమె ముఖం పాలిపోయింది.

"చంద్ర వెరీ సీరియస్, స్టార్ట్ ఇమీడియట్లీ."

"ఏమండీ : సరిగ్గా చూశారా ఇదేమిటో ....చంద్రకి సీరియ ..."

"నాకు తెలుసు రాధా ..." చిరునవ్వులో ఆ కాగితాన్ని అందుకొంటూ అన్నాడు.

"మరి మీరు .... అవతల అంత సీరియస్‌గా వుంటే తనకి ..."

"పోనిద్దూ!అనవసరంగ నిద్ర పాడుచేసుకొన్నాం. రా పడుకుందాం...." బెడ్‌రూమ్‌లోనికి దారితీశాడు.

"ప్రభా ....మీ రింత కఠినంగ ఎందుకు ప్రవర్తిస్తున్నారో నాకర్థం గావటంలేదు." కాస్త కఠినంగ ధ్వనించిందామె స్వరం.

"చెప్తాను ఇలారా" మంచంమీద పడుకొంటూ అన్నాడు. పక్కనే వచ్చి కూర్చుందామె మౌనంగా.

"ఇది మన పెళ్ళికాక పూర్వం జరిగిన విషయం రాధా....సరిగ్గా ఓ ఆదివారం మధ్యాహ్నం చంద్ర రూమ్‌లో కూర్చుని మాట్లాడుకుంటున్నాం.

* * *

"అరేయ్ చంద్రా....వెరీవెరీ సారీరా....అంత మంది ఎదుట నిన్ను ఫూల్ చేసినందుకు క్షమించు.. ప్లీజ్...." వాడి చేతులను నా చేతుల్లోకి తీసికొంటూ. బ్రతిమాలుకొన్నాను. అప్పటికి అలా బ్రతిమాలటం అది ఏ పదోసారో. అంతవరకు సీరియస్‌గా ఉన్న వాడల్లా గట్టిగా నవ్వేశాడు చేతులు విడిపించుకుంటూ. ఈసారి నాకు నోటమాట రాలేదు ఆశ్చర్యంతో.

"ప్రభాకర్...ఎందుకురా అంత ఇదయిపోతావ్... నిజంగానే నేను కోపం తెచ్చుకున్నాననుకుంటున్నావా?....ఛఛ ...లేదోయ్ ఏదో ఫ్రెండ్‌గదా అని ఏప్రిల్ ఫూల్‌ని చేశావ్. అంతలోకే కోపం తెచ్చుకుంటానా ? అందులోను నీ మీద...."

"అయితే ఇప్పుడు నేను ఫూల్ నయ్యానన్న మాట...." నేను నవ్వేశాను వాడితోపాటు.

"అది సరేగాని....ప్రభాకర్, నాకో అయిడియా వచ్చింది." ఏమిటన్నట్లు ఆసక్తిగా చూశాను.

"దీనికేవుంది గాని.... నెక్స్ టైము మనిద్దర్లో ఎవర్ని ఎవరు ఫూల్‌చేస్తారో చూద్దాం....ఓకే ?" అన్నాడు ఉత్సాహంగా.

"ఓ. కే." అన్నాను వాడి చేత్తో చేయి కలిపి. "కాని చంద్రా....అప్పటికీ విషయం నువ్వూ నేనూ మరచిపోవచ్చు...." సందేహంగా చూశాను.

"అదేనోయ్ మరి....అలా గుర్తుంచుకోడంలోనే గొప్ప....నేను మాత్రం మర్చిపోను – నువ్వు మర్చిపోయినా సరే."

అంతవరకు లేని పంతం నాలోను హెచ్చింది. "నువ్వు ఎంత ప్రయత్నించినా నేను మాత్రం ఫూల్‌ని కాను....ష్యూర్...."

* * *

కాలెండర్‌లో రెపరెపలాడుతున్న పైకాగితం క్రింద ఏప్రిల్ ఒకటో తేది కన్పిస్తోంది. అంత వరకు రెప్పవాల్చకుండా వింటున్న ఆమె కళ్ళలో ఆశ్చర్యం స్పష్టంగా వ్యక్తమౌతుంది. "అయితే ఏప్రిల్ ఫూల్ చేయడాని కలా పంపేడంటారా అన్నయ్యా ?''

నవ్వుతూ అన్నాడు "ఇంకా అనుమానమా ?''

"ఇందాక తొందరపడి మీ మనసు నొప్పించి నందుకు నన్ను క్షమించండి ! ఎందుకో చంద్రని చూస్తుంటే చచ్చిపోయిన అన్నయ్య గుర్తుకొస్తాడు.... ఆ అభిమానంతో ఇందాక అలా మాట్లాడాను."

"లేదు రాధా.... నేనైనా ఆ సమయంలో ఇంతే ఇందులో క్షమించడాని కేమీ లేదు.

మర్నాడు ఉదయం ఏడుగంటలప్రాంతం ఇంకా చలిగా ఉండడంవల్ల తలుపు లన్నీ మూసేసుకొని టేబిల్‌లైటు వేసికుని కూర్చుని లెటర్‌పాడ్, పెన్ తీసికొని వ్రాయటం మొదలు పెట్టాడు.

డియర్ విజయచంద్రా !

సారీ : నన్ను ఫూల్‌ని చేయబోయి నువ్వే ఫూలయ్యావ్ !........

మొదటిలైను కూడ పూ ర్తికాలేదు. ...టెలిఫోన్ గణగణా మ్రోగుతుంది. ఎంతో సరదాతో మొదలు పెట్టిన పనికి మొదట్లోనే అంతరాయం కలగడంతో కాస్త విసుగ్గానే లేచి వెళ్ళి రిసీవర్ అందుకొన్నాడు.

''హలో ప్రభాకర్ హియర్".........

''నువ్వట్రా రాజు........ ఏమిటి మాంచి బిజీగా ఉన్నట్లున్నావ్ ?"

'......... ........................'

''హహ్హహ్హ ....వండ్రఫుల్ .... నువ్వూ ఫూల్ అయ్యావన్నమాట.''

" ................................................"

"ఏమిట్రా నువ్వనేది ....నుప్ చూశావా ?"

''........ ...................................."

"వ్వాట్ .... ...ఏక్సిడెంటా.........రాజూ ప్లీజ్.... నిజం చెప్పరా........"

"........ ........ ............"

"నో ....నో— ఇట్సింపాసిబుల్" గట్టిగా అరిచాడు. రిసీవర్ టేబిల్ మీదినుండి క్రిందకు జారి వైరుతో వ్రేలాడుతోంది.

పది నిముషాల వరకు అతనిలో చలనం లేక పోయింది. మనసు మొద్దుబారి పోయింది.అచేతనంగా కుర్చీలో కూలబడ్డాడు.

అపుడే స్నానంచేసి వచ్చిన రాధ చల్లని చేతులు నుదుటిమీద పడేసరికి అతని మత్తు పూర్తిగా దిగి పోయింది. కనురెప్పలు మెల్లిగా తెరిచాడు.....కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయ్..........ఎదురుగా నించున్న రాధకళ్ళలోఆత్రుత, ఆందోళనవిస్పష్టంగా వ్యక్తమౌతున్నయ్.

"..........." ప్రభాకర్ మాట్లాడ లేకపోయాడు.

"ఏమయింది చెప్పండి....... ఎందుకిలా అయిపోయారు. ''

మాట్లాడలేదు ప్రభాకర్.... ఒక్కసారి ఆమె కళ్ళలోకి చూచి తలొంచుకున్నాడు. మెల్లిగా లేచి అడుగులో అడుగు వేసికొంటూ గదిలోనికి నడిచాడు. రాధ ఏదో ఆలోచిస్తూ అలానే ఉండిపోయింది.

ఎందుకో అతనికి దుఃఖం రావడంలేదు. హృదయం మొద్దుబారి పోయింది.కన్నీళ్ళు కళ్ళలోనే యింకిపోయాయి.... మోచేతులను టేబిల్‌మీద ఆన్చి అరచేతుల్లో ముఖం దాచుకున్నాడు.

దుఃఖం ముంచుకొచ్చింది. "చంద్రా : ఎంత దురదృష్టవంతుణ్ణిరా, ఆఖరి చూపుకోసం అంత తపిస్తే కనీసం ప్రాణ స్నేహితుడి కనీస కోర్కె అయినా తీర్చలేక పోయానే.... చంద్రా.... ఎంత పొరపాటు చేశాను.... ఇక నీ కళ్ళతో నన్ను చూడలేవా ?.... నీ నోటితో "ప్రభా" అని ఆప్యాయంగా పిలువలేవా? ఎంత పొరపాటు జరిగిపోయిందిరా...."

చేతి వ్రేళ్ళ సందుల్లో నుండి టేబుల్ లైట్ కాంతిలో భూతద్దంలోలా కనిపిస్తున్నయ్ ఉత్తరం లోని అక్షరాలు.

"నన్ను ఫూల్‌ని చెయ్యబోయి నువ్వే ఫూలయ్యావ్"

"కాదు.... కాదు....ఫూల్ అయింది నేనురా చంద్రా" అతని హృదయం ఆక్రోశించింది నిస్సహాయంగ.

# లయోలాలో దుర్యోధనుడు

బి. వెంకటేశ్వర్లు,
బి. యస్‌సి. ప్రథమ

శ్రీరా! ఏమి యీ లయోలా కళాశాల సౌందర్యము. అల్లదుగో! ఆ కన్పట్టునదేమై యుండును? ఎద్దియో లిఖిత ఫలకము వ్రేలాడు చున్నదే. చూచెద.... ఓహో ఇది జేవియర్ వసతి గృహమా? అత్యంతాధునికముగా నున్నదే. ఇం దించుమించు నూరు గదు లున్నవేమో! అదే .... ఆ కన్పించు గదిలో తెల్లని వస్త్రములతో కన్పించున దెవరు .... ఓహో తెలిసినది. ఈ వసతి గృహ సంరక్షణాధికారియై యుండును. దీనికి సమీపమున రంగు రంగుల అలంకారములతో సుందర వనము మధ్యన కానిపించునది చర్చియా! ఎంత సుందరముగా నున్నది! అవిగో. ఏవో భవనములు కనిపించుచున్నవి. అవియును దర్శించెద .... ఏమిది .... ఈ ప్రదేశమునకు వచ్చినతోడనే క్రుళ్ళిన కోడిగుడ్ల వాసనతో నాసిక బ్రద్దలగుచున్నది!! లోనికి వెళ్ళి విచారించెద .... ఆహాహా .... ఏమిది ... భ్రమించుచుంటినా .... ఇన్ని గాజు పరికరములు నేనెక్కడను ఇంతకు ముందు చూచి యుండలేదే .... ఇందరు విద్యార్థులు ఇచ్చట చేయుచున్నదేమి? అర్థమైనది. ఇది రసాయన శాస్త్ర ప్రయోగశాల గదూ! వీరు ప్రయోగములు చేయుచున్నారు .... ఏమిది .... ఈ గదిలో ఇందరు ఉద్యోగులున్నారేమి? ఓహో–ఒక్కొక్క పని ఒక్కొక్కరు చేయుచున్నారులా యున్నది. .... ఏమది....ఎచటి నుండియో టక్....టక్....టక్‌మను ధ్వని. అదిగో ఆ టేబిల్‌వద్ద నుండి వచ్చుచున్నది. అతనేదియో యంత్రముపై లయబద్ధముగా కొట్టుచున్నాడు. ఓహో అది టైపు మిషన్ అయ్యుండనోపు. ఎదురుగా నేదియో కన్పించుచున్నది. వెళ్ళిచూచెద. అహో.. ఇదిపుస్తక భాండాగారమా? ఎన్ని పుస్తకము లున్నవి. నేనును ఒక గ్రంథము తీసుకొని చదివెదగాక....ఆ విద్యార్థులందరు నేవో ఎర్రటి అట్టలపై అంటించిన తమ ఛాయా చిత్రములను ఆ ఉద్యోగి చూపుతున్నారెందులకో. ఓహో అది గుర్తింపు పత్రమయ్యుండును. అగుచో నాకు పుస్తకము లభించదు గదా! ఏమిది .... ఇంత సువాసన వచ్చుచున్నది? .... ఓహో ఇది ఫలహారశాల నుండియా .... నేనును ఇసుమంత ఫలహారము సేవించెద .... ఏమిది .... ఎచట నుండియో బర్ .... బర్–మని ధ్వని వచ్చినతోడనే విద్యార్థులు కడు ఆతురతతో పోవుచున్నారు. ఓహో ....కళాశాలకు వెళ్ళవలసిన సమయ మిద్దియ కాబోలు .... అబ్బ .... మూడవ అంతస్తుకు వచ్చుసరికి పాదము లలసి పోయినవి. ఆఁ! ఏమిది.... వీరు విద్యార్థులేనా .... అయినచో ఇంత నిర్దాక్షిణ్యముగా ఇన్ని మండూకములను విచ్ఛేదన చేయుదురా!! ఓహో అదియును ఒకపాఠ్యాంశ మయ్యుండును .... ఆ హా హాఁ! .... ఈ దారి ప్రక్కల నున్న వృక్షముల నుండి వీచు మలయమారుతము మనసున కెంత ఆహ్లాదకరముగా నున్నది .... ఇట నేదియో కోడిగ్రుడ్డు ఆకృతిలో అనేక గదులు గల భవనమున్నది. ఇదియే గోగినేని వసతి గృహమై యుండనోపు .... ఆహాఁ లోపల ఎంత అందముగా నున్నది. రంగు రంగుల పూల మొక్కలతో గుబురుగా పెరిగిన పొదలతో నేత్ర పర్వముగా నున్నది. ఇదేమి? .... రహస్య ద్వారమా? అవును ఇది ప్రక్కనేయున్న నూతన వసతి గృహమునకు పోవు మార్గము .... ఇది మరియును ఆశ్చర్య జనకముగ నున్నది....ఆ రహదారి ప్రక్కగా చల్లని చెట్ల నీడన ఏవో సోపానము లగుపించుచున్నవి....ఇది బహిరంగోపన్యాస నివేశన స్థలము. ఆ ఎదురుగానెద్దియో రష్

ణీయముగా కనిపించుచున్నది. వెళ్ళిచూచెద ...ఓహో ఇంతవరకు దర్శించిన వాని సౌందర్య మొక ఎత్తు. ఇది యొక్కటే ఒక యెత్తు....ఎంత రమణీయముగా నున్నది....ఆ వరండాలలో సంచరించువార లెవరు? క్రిందికి పైకి ఒక్కటే స్వచ్ఛందమైన తెల్లని వస్త్రము ధరించి యున్నారు. ఆ(-వారలే ఈ కళాశాలకు అధిపతులై యుందురు. వీరు నివసించుచున్న ఈ భవనమునకు తెలుగు పేరేమిటో తెలియరాకున్నది.ఆంగ్లమున దీనిని **Father's Quarters** అందురట.

ప్రస్తుతము ఈ సుందరోద్యానవనము నుంచి శలవు తీసుకొనుచుంటి. ఏది ఏమైనను మత్పుత్రుని రాబోవు సంవత్సరమున నీ విద్యాసంస్థలోనే జూనియర్ ఇంటర్మీడియెట్‌లో చేర్పించెద....

ANDHRA LOYOLA COLLEGE
LIBRARY
VIJAYAWADA

# లాండ్ ఆర్మీ

బి. గంగయ్య
II B. A.

యువకుల శక్తి యుక్తులు మనదేశంలో వ్యర్థం అవుతున్నంతగా మరేదేశంలోనూ కావడంలేదనిచెప్ప వచ్చును. నానాటికి పెరుగుతున్న నిరుద్యోగాన్ని దానికి సూచికగా తీసుకొనవచ్చును. నిరక్షరాస్యుల నటుంచి, విద్యావంతు లయిన యువతీ యువకులకే ఉద్యోగాలు దొరుకుటలేదు. ఈవిధంగా యువలోకపు శక్తి సామర్థ్యాలు ఎందుకూ పనికిరాని పరిస్థితి ఏర్పడింది. ఈ వాతావరణంనుండి మన యువకులను తప్పించి వారి శక్తియుక్తులు సమాజోద్ధరణకు వినియోగపడేలా చేయడం విజ్ఞులయిన పెద్దవారు చేయవలసిన పని. దానికి తగినట్లుగా మన విద్యావిధానం కూడా మారాలి. ప్రతీ సంవత్సరం లక్షల కొలది గ్రాడ్యుయేట్లను, పోస్టు గ్రాడ్యుయేట్లను తయారు చేస్తున్నది మన విద్యావ్యవస్థ. ఆ నేర్చుకొన్న విద్యకూడ విద్యార్థులకుగాని, సమాజానికిగాని ఏ విధంగాను ఉపయోగ పడటంలేదు. ప్రతీ డిగ్రీ హోల్డరూ, చదువు పూర్తయిన తరువాత ప్రభుత్వ సంస్థలలో వైట్‌కాలర్ జాబ్స్‌కోసం ఎదురుచూడటమే తన విధిగా భావిస్తున్నాడు. యువకులలో ఈ రకమైన ఆలోచనావిధానాన్ని రూపుమాపాలి. అందుకు మన విద్యావిధానం దోహదం చేయాలి. మన బాపూజీ ఈ పరిస్థితిని ఆనాడే గుర్తించి గుమాస్తాలను తయారుచేసే ఆంగ్లేయ విద్యావిధానం మారి, ప్రతి విద్యార్థికి విజ్ఞానంతోపాటు ఏదో ఒక వృత్తివ్యాపారాదులను బోధించే విద్యావిధానం కావాలన్నారు. కాబటి యువకుల శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా విద్యావిధానం మారాలి. లేకపోతే లక్నో యూనివర్సిటీకి పటిన గతి దేశంలోని మిగతా యూనివర్సిటీలకు కూడా పట్టవచ్చు.

మన విద్యావిధానంలోని లోటుపాట్లను సవరించి సమాజాన్ని చైతన్యవంతం చేయగల ప్రత్యామ్నాయ మార్గమొకటున్నది. అదేలాండ్ ఆర్మీని నిర్మించడం. లాండ్ ఆర్మీ అంటే యువతీ యువకులతో కూడిన ఒక స్వచ్ఛంద సేవాదళం. విద్యావంతులే కాక, నిరక్షరాస్యులైన యువతీ యువకులు కూడ దీనిలో చేరి స్వచ్ఛందంగా సేవ చేస్తారు. లాండ్ ఆర్మీ యువలోకపు ఆత్మబలం, దేశభక్తి, సోదర, సహకార భావములకు చిహ్నం. ఈ సుగుణాలను ఆయుధాలుగా చేసుకొని ఈ 'లాండ్ ఆర్మీ' దేశంలో నిర్మాణాత్మక కార్యక్రమాలు కొనసాగిస్తుంది.

ఈ లాండ్ ఆర్మీ పద్ధతి యుగోస్లావియా, చైనా, ఇరాన్‌లలో అద్భుతమైన ఫలితాల నిచ్చింది. యుగోస్లావియాలో దాదాపు 2 లక్షలమంది యువతీ యువకులు 'లాండ్ ఆర్మీ'గా ఏర్పడి పర్వత ప్రాంతాలలో సొరంగాలు, వంతెనలతో కూడిన 200 కి. మీ. రైలుమార్గాన్ని నిర్మించారు. ఇక ఈ లాండ్ ఆర్మీ ఎట్లా నిర్వహించబడిందీ చూద్దాము. ఈ రెండు లక్షల మందితో కూడిన 'లాండ్ ఆర్మీ' ఒక విశాల ప్రదేశానికి తరలివెళ్ళి అక్కడ తమకు కావలసిన సౌకర్యాలను ఏర్పరచుకొంది. వాటిలో లేబరేటరీలు, లైబ్రరీలు, థియేటర్లు కూడ ఉన్నాయి. సూర్యోదయానికి ముందే మొదటి గంట మ్రోగుతుంది. అప్పుడందరూ స్నానపానాదులు ముగించి, రెండవసారి గంట మ్రోగేటప్పటికి అందరూ ఒక విశాల ప్రదేశానికి చేరుకొంటారు. అక్కడ వారి జాతీయ పతాకము ఆకాశంలో రెపరెపలాడుతూ దర్శన మిస్తుంది. అప్పుడందరూ కలసి ముక్తకంఠంతో జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. తర్వాత వారందరూ వారి వారి పరికరాలతో తాము పని చేయవలసిన ప్రదేశానికి వెళ్తారు. అక్కడ దేశభక్తి గీతాల నాలపిస్తూ సంతోషంగా తమ పనిని ముగిస్తారు. అక్కడ జరిగే పని అంతా నిపుణుల పర్యవేక్షణలో జరుగుతూండేది. మధ్యాహ్నం భోజనాదుల తర్వాత కొంతసేపు విశ్రాంతి తీసుకొనేవారు. తర్వాత దాదాపు మూడుగంటలసేపు విద్యాకార్యక్రమాలు కొనసాగేవి. లెక్చరర్సుతో సంభాషణలు, గ్రూపు డిస్కషన్స్, ఎక్స్‌పెరిమెంట్సుతో విద్యా కార్యక్రమము ముగిసేది. తరువాత వ్యాయామ క్రీడలతో ఆ ప్రదేశమంతా నిండి

ఉండేది. రాత్రి భోజనాల తర్వాత సంగీతం, ఫిల్ములు, నాటకములతో, సారస్వత కార్యక్రమం ముగిసేది. ఈ విధంగా అది లాండ్ యూనివర్సిటీగాకూడ పని చేసేది. ఈ విధంగా మొత్తం ఏడునెలల్లో 200 కి.మీ. రైలుమార్గాన్ని నిర్మించుకో గలిగారు. మనకు అమితాశ్చర్యము కలిగించే విషయం. ఈనాడు యుగోస్లావియా నాయకులను చూసినట్లయితే వారం దరూ ఈ 'లాండ్ ఆర్మీ'లో పనిచేసినవారే. చైనాలో కూడ ఈ విధమైన దళాలు ప్రపంచంలో అతి పెద్దదైన 'డాము'ను నిర్మించుకొన్నాయి. ఈ పద్ధతి కమ్యూనిస్టు దేశాలకే పరిమితం కాలేదు. రాచరికపు వ్యవస్థఉన్న ఇరాన్‌లోకూడా ఇటువంటి దళాలు తమదేశంలో నిరక్షరాస్యతను తొలగించడంలో ప్రముఖపాత్రను వహించాయి.

మనదేశంలో ఈ 'లాండ్ ఆర్మీ'ని నిర్మించటం, దాన్ని నిర్వహించటం ఎట్లా అనే ప్రశ్నలు ఉదయించడం సహజం. మనదేశంలో ఎంతోమంది, విద్యావంతులు, నిరక్షరాస్యులు అయిన నిరుద్యోగులున్నారు. విద్యార్థులున్నారు. వీరిలో సాంకేతిక నిపుణులు, ప్రజ్ఞా పాటవా లున్న వారున్నారు. వీరందరినీ చేర్చి 'లాండ్‌ఆర్మీ'ని నిర్మించవచ్చు. ఇక దీని నిర్వహణ, గంగా–కావేరి లింక్‌వంటి జాతీయ ప్రాముఖ్యంగల పథకాలను చేపట్టి వాటికి అవసరమగు లెక్కలు. ప్లానులు తయారుచేసి వాట్టిని ముద్రించి 'లాండ్ ఆర్మీ' కివ్వాలి. తరువాత ఆయా ప్రదేశానికి 'లాండ్ ఆర్మీ'ని తగిన సరంజామాతో తరలించాలి. విద్యా కార్యక్రమాలు కొనసాగించడానికి అనుగుణంగా లెక్చరర్లు, లైబ్రరీలు, లేబరేటరీలను కూడా అక్కడికి తరలించాలి. మొత్తం పనిని చిన్న చిన్న భాగాలుగా విభజించి, నిరుద్యోగులయిన సాంకేతికనిపుణు లొక్కొక్కరికి ఒక్కొక్క భాగాన్ని అప్పగించాలి. జరుగుతున్న పనిని పరిశీలించడానికి నిపుణులయిన ఉద్యోగులను నియమించాలి. ఈ విధంగా పని చేస్తున్న సమయంలో ఒకప్రక్క విద్యా కార్యక్రమాలను కూడా నిర్వహించాలి. ప్రతి విద్యార్థీ సంపత్సరంలో కొంత భాగాన్ని ఇక్కడ గడిపేలా చేసి 'లాండ్ యూనివర్సిటీగా ఆ ప్రదేశాన్ని మార్చాలి. లెక్చరర్సుతో సంభాషణలు, గ్రూప్ డిస్‌కషన్స్, ఎక్స్‌పెరిమెంట్లతో ఈ విద్యా కార్యక్రమాలు కొనసాగాలి. ఈ విధంగా నేర్చుకొన్న విద్య నిజ జీవితానికి దగ్గరగా ఉంటుంది. అప్పుడే విద్యార్థి చదువుకున్న దానికి, అతడు చేసేదానికి పొంతన కుదురుతుంది. ఈ విధంగా సమాజంలో చైతన్యం వెల్లి విరుస్తుంది.

ఈ 'లాండ్ ఆర్మీ'ని తయారు చేయడానికి, నిర్వహించడానికి వెచ్చించ వలసిన డబ్బును ప్రతిబంధకంగా కొందరు నిరాశావాదులు పేర్కొనవచ్చు. వారు మన ప్రభుత్వము ఏటేటా పెడుతున్న ఖర్చును గమనించ వలసిందిగా కోరుతున్నాను. ప్రతి సంవత్సరమూ చిన్న చిన్న పథకాలపై కూడా కోట్లాది రూపాయాలు ఖర్చు పెడుతున్నది మన ప్రభుత్వం. కాని వాటినుండి వచ్చే ఫలితాలు మాత్రం అంతంతమాత్రంగా ఉంటున్నాయి. విద్యావ్యవస్థలో లోటుపాట్లవలన విద్యా రంగంపై ఖర్చుచేస్తున్న డబ్బుకూడా సత్ఫలితాలను ఇవ్వడం లేదు. వాటి ఖర్చులను తగ్గించి ఆ మొత్తాలను ఈ 'లాండ్‌ఆర్మీ'కై ఖర్చు పెట్టినట్లయితే విద్యా ప్రమాణాలు పెరగటమేకాక అధికారులల్లో అవినీతిని కూడా పోగొట్టవచ్చును. ఇటువంటి పథకాల వల్ల యువకులలో దేశభక్తి పెరిగి, కులమత వర్గభేదాలు సమసిపోతాయి. యువకులకు నాయకత్వ లక్షణాలు అలవడతాయి. తద్వారా మనకు సమర్థులైన నాయకుల కొరత తీరుతుంది. అప్పుడే మన సమాజం నవచైతన్యంతో నాట్యంచేస్తుంది,

జై హింద్

# స్నేహ ధర్మం

పి. నాగార్జునరావు

పాత్రలు :

మధు : పాతికేళ్ళుంటాయి. యూనివర్శిటీలో ఎమ్మెస్సీ చదువుతుంటాడు.

సుధాకర్ : మధు ప్రాణస్నేహితుడు.

కృష్ణ
జగన్
సుబ్రావ్
రవి
} : మధు, సుధాకర్‌ల స్నేహితులు సుమారు అంతే వయసుంటుంది.

అవధాని : ఏభై ఏళ్ళుంటాయి.

[విశాలంగా ఉన్న హాలుకు మధ్యగా పొందిగ్గా అమర్చిన ఫర్నిచర్, ఒకమూల టీపాయ్ మీద రంగు రంగుల పూలతో అందమైన ఫ్లవర్ వేజ్, మరొక మూల రౌండ్‌గా ఉన్న టేబిల్‌మీద టెలిఫోన్, గోడలకు అందంగా వ్రేలాడుతున్న ఆయిల్ పెయింట్స్, రాధాకృష్ణుల ప్రేమకు చిహ్నంగా ముచ్చట గొలిపే తెల్లని దంతపు బొమ్మ.... టేబిల్‌మీద లైటు వెలుగుతూ ఉంటుంది. లైటుముందు కూర్చుని దీక్షగా ఏదో వ్రాసుకుంటుంటాడు మధు. నౌకర్ వచ్చి పాల గ్లాసు దగ్గరగా పెట్టి వెళ్ళిపోతాడు.

బయట హోరున గాలివాన.... విసురుగా వీచిన గాలికి కర్టెన్ అటూఇటూ ఊగుతుంది. టక్‌టక్‌మన్న తలుపు శబ్దం. మధు వెళ్ళి తలుపు తీస్తాడు. వర్షంలో తడిసిన ఓ వ్యక్తి కంగారుగా లోపలకి వచ్చి తలుపు మూసేస్తాడు. అతని జుట్టు తడిసిపోయి, చెదిరిపోయి ఉంటుంది. దుస్తులమీద అక్కడక్కడ రక్తపు మరకలుంటాయ్.]

మధు : (గుర్తుపట్టి ఆశ్చర్యంగా) సుధా ! ఏమిటిది ?.... ఏమిటీ అవతారం ...అరె, ఆ మరకలేమిటి ?.... ఏమైందసలు....?

సుధా : ప్లీజ్ మధూ ! అవేమీ చెప్పటానికి సమయం లేదు.... ఏదైనా దాక్కోనేందుకు స్థలం చూపించు.... పోలీసు లొచ్చేస్తున్నారు .... ప్లీజ్ మధూ ! (ఆయాసంతో వగురుస్తూ వెనక్కు తిరిగి భయం భయంగా చూస్తుంటాడు).

మధు : (అయోమయంగా) పోలీస్‌లా ? ఎందుకు ?

సుధా : అదంతా తర్వాతగాని, ప్లీజ్ డోంట్ వేస్టు మై టైమ్.

మధు : [దగ్గరగా వెళ్ళి అతని భుజాలు పట్టుకుని కూర్చోబెడుతూ].... తలుపులు వేసేఉన్నాయి.... ఫర్వాలేదుగాని నువ్వు నిదానంగా అసలు సంగతి ఏమిటో చెప్పు.

సుధా : (తలుపువేపు చూస్తుంటాడు) .... ...హత్య మధూ ...హత్య....

మధు : వ్వాట్.... హత్యా.... నువ్వు.... నువ్వు చే....

సుధా : లేదురా, నా మాట నమ్ము, నిజం! నేను హత్యచేయలేదు .... కాని ఊహించని విధంగా ఈ నేరం నా మీద కొచ్చింది. (జేబులోనుండి రక్తంతో ఉన్న బాకుతీస్తాడు)

మధు : సుధా ! ఏమిటిది.... నీకు మతిపోలేదుకదా ! (అనుమానంగా చూస్తాడు)

సుధా : ఒరేయ్.... నువ్వుకూడా అనుమానిస్తున్నావా నన్ను ? [జాలిగా చూస్తాడు]

మధు : లేదు........ జరిగిందేమిటో ముందు చెప్పు, లేకపోతే నాకేమీ అర్థం కావటం లేదు.

సుధా : [ఓసారి బెరుగ్గా వెనుకకుచూసి] హత్య చేసిం దెవరోగాని, ఆ హత్య జరిగినచోట నే నుండగా పోలీసులు చూడటం తటస్థించింది .... అంతేరా నిజం.... నాకే పాపమూ తెలీదు....

మధు : నువ్వక్కడ ఎలా ఉన్నావ్ అప్పుడు ?

సుధా : నేనా....? రాత్రి టౌన్‌లో పనిచూసుకుని ఇంటికి బయలుదేరాను. అప్పటికే బాగా రాత్రయిపోయింది. ఒక సందులో నుండి వస్తుండగా ఎవరిదో కేక వినిపించింది. అటుగా పరుగెత్తాను.... [ఆయాసంతో గుండె పట్టుకుని ఆగుతాడు].

మధు : (ప్రక్కనేఉన్న పాలగ్లాసు తీసి అందిస్తూ) ఇది తీసుకో, కాస్త ఆయాసం తగ్గుతుంది.

సుధా : వద్దు మధూ, అవతల పోలీసు లొచ్చేస్తారు....

మధు : (బలవంతంగా) పర్వాలేదు నేనున్నానుగా....

సుధా : (ఒకటి, రెండుసార్లు సిప్‌చేసి క్రింద పెట్టేస్తాడు)

(ఓ నిమిషం నిశ్శబ్దం)

మధు : ఊఁ....తర్వాత ఏమైంది ?

సుధా : అప్పటికే ఆ వ్యక్తి గిలగిలా కొట్టు కుంటున్నాడు.

మధు : అపుడు ...

సుధా : దగ్గరకువెళ్ళి చూసేసరికి గుండెల్లో బాకు దిగబడివుంది....ఇంకా కొనప్రాణం వుంది .... గుండెల్లోనుండి బాకు మెల్లిగా తీసేసాను .... అంతే బూట్లు టక టకమని చప్పుడవుతున్నాయ్ దూరంగా....

(టక్ టక్ టక్ .... తలుపుతట్టిన శబ్దం)

సుధా : వచ్చేసారు....ఇక లాభంలేదు వచ్చేసారు....

మధు : పర్వాలేదు, నువ్ లోపలికివెళ్ళి బట్టలు మార్చుకొనిరా ; (నెమ్మదిగా చెప్పి, తలుపు దగ్గరకెళ్ళి తలుపు తెరుస్తాడు. అవధాని వణికిపోతూ లోపలకు ప్రవేశిస్తాడు. మధు తలుపు మూసేస్తాడు తిరిగి)

మధు : రండి రండి....అలా కుర్చీలో కూర్చోండి.... పాపం వర్షంలో తడిసినట్టున్నారు బాగా.

అవధాని : (వణుకుతూ) హూ.... హూహూఁ .... ఏమిటో ఈ గాలివాన.... రోహిణీకార్తిలో ఈ వర్షాలేమిటి చెప్పు....అహఁ....అసలు మా చిన్న తనంలో ఎప్పుడయినా చూశామంట ఇలాటిఅకాల వర్షాలు .... ఉహూహూ హుహూ (వణుకుతాడు) ఆ అంతేలే, రోజురోజుకీ విపరీతం అయిపో తోందీ కలియుగం....అబ్బ ఏవిఁ చలి నాయనా.... కాస్త అలా ఆ తువ్వాలు అందుకుంటావూ!....

మధు : (తువ్వాలందిస్తాడు)

అవ : (తుడుచుకొని) ఆ కరణంగారున్నాడు చూశావూ .... ఆయనేనయ్యా.... ఆ నారాయణ శాస్త్రి లేడూ....?

మధు . అవునవును.

అవ : ఆఁ .... ఆయనే....అందరూ పెద్దమనుషులే నాయనా! ఆయన ము తాతగారి పె త్తల్లి తద్దినం పెట్టానా? ఎప్పుడూ....సరిగ్గా ఫాల్గుణ అమావాస్య రోజు....ఏమిటీ ఆయనిచ్చే మూడు రూపాయలకీ మూణ్నెల్లుగా ఇంటిచుట్టూ ప్రదక్షిణం చేయించు కుంటున్నాడు....ఆఁ....ఎక్కడ చూసినా ఇంతే.... సరేలే ఏవఁనుకొని ఏం లాభం ...అబ్బబ్బ చలి, వెధవచలి! ఈ ముసలాడిమీదా దీని ప్రతాపం.... (అక్కడున్న పాలగ్లాసు తీసికోబోతూ) చూడు నాయనా.... మహా చెడ్డ చలిగా ఉంది ... ఈ చల్లటి పాలు నువ్వేం తాగుతావుగాని .... కాస్త మరోగ్లాసు వేడి పాలు తెప్పించుకుందూ నీకు....

మధు : అహఁహఁ ఆగండి ...అవి నేను తాగినవి.... ....(లోపలికి చూస్తూ) ఒరేయ్ రంగా ! ఓ గ్లాసు వేడిపాలు పట్టుకురా !.... త్వరగా ....

అవ : అన్నీ నాన్నగారి లక్షణాలే.... నాన్నగారు కూడా అచ్చు ఇలాగే కేకేసేవారు నేనొచ్చేసరికి 'రంగా' అంటూ పాలుతెమ్మని, (నవ్వుతాడు)

మధు : (ఇబ్బందిగా చూసి) సుధా ! (లోపలికి చూస్తూ పిలుస్తాడు)

అవ : ఎవరునాయనా! మీ మేనమావఁగా రమ్మాయను కుంటూ సుధంటే....

మధు : [నవ్వి] కాదండీ.... నా స్నేహితుడు సుధా కరం.

[సుధాకర్ తిరిగి ప్రవేశిస్తాడు]

సుధా ; [విసుగ్గా చూస్తూ] నమస్కారమండీ !

అవ ; చిరంజీవి సుఖీభవ ! [జందెం సవరించు కుంటూ] అబ్బాయ్ అమ్మగారూ, నాన్నగారూ....

మధు : లేరండీ, నిన్నే అమలాపురం వెళ్లారు.

అవ : మీ మేనమావఁగా రింటికేమిటీ ? శుభం ! శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు.

మధు : (నవ్వుకుంటూ) మీ కెపుడూ అదే ధ్యాస....

అవ : అంతకంటె ఏ ముంటుంది నాయనా చిన్న ప్పటినుండీ తెలిసిన ఇల్లు. .... అసలు నువ్వు

పుట్టినపుడు అదే ప్లవంగ నామ సంవత్సర మాఘ శుద్ధ ఏకాదశి రోజనుకుంటాను .... నేనే కదు టోయ్ బారసాల చేయించింది.... ఏదో మీ నాన్న గారూ.... నేను ఓ తరం వాళ్ళం ........ ఇలాటి యిళ్ళల్లో శుభకార్యాలా జరిగితేనే కదా నాలాటి వాడికి ఏదో అదీ ఇదీ .... అది సరేగాని ఇటు చూడు (మెల్లిగా)ఒక్క రెండు రూపాయలుంటే ఇస్తావూ ...ఈ సంసారాన్ని ఈడ్చి ఈడ్చి నడుం ఎలా వంగిపోయిందో చూడు (లేచి నుంచుని వంగి చూపిస్తాడు.)

మధు : దానికే వుందిలెండి. [జేబులో నుండి నోటు తీసిస్తాడు.] (రంగ పాలగ్లాసు అవధాని దగ్గ రుంచి వెళ్ళిపోతాడు).

అవ : [ఒక్కసారి అవన్నీ తాగేసి గ్లాసు క్రింద పెట్టి] ఆహా.... ఏమి రుచి ఏమి రుచి ....అసలు మీ ఇంట్లోనే అంతే నాయనా; [బయటకు తొంగి చూసి] ఇకవస్తాను .... వర్షం తగ్గినట్టుంది....

మధు : జాగ్రత్తగా వెళ్ళండి. గొడుగు ఇమ్మం టారా ?

అవ : వర్షం తగ్గిందిగా .... వెళ్ళి పోగలనులే నాయనా !

(నిష్క్రమిస్తాడు)

సుధా : భలేవాడే, సరిగ్గా సమయానికి వచ్చి తగులు కున్నాడు.

మధు : ఏదోలే కానీయ్ .... ఊ చెప్పు తర్వాత సంగతి.

సుధా : పోలీసులు పరిగెత్తు కొస్తున్నారని కదూ చెప్పానిందాక.

మధు : అవును.

సుధా : బూట్ల శబ్దంగరపుతోంది ...నాకు తెల్సు.... ఆ భగవంతుడికి తెలుసు - నే నీ పాపం చేయ లేదని. కాని పోలీసులకు తెలియదుగా. వాళ్ళకు కళ్ళెదురుగా కనిపించిందే నిజం....నిజం చెప్పినా నమ్మలేరు....ఆలోచించటానికి కూడా సమయం లేదు....కాలి సత్తువకొద్దీ పరుగెత్తాను నా చేతిలో కత్తి అలానే ఉండిపోయిందన్న సంగతి మరచి పోయి....పోలీసులూ పరుగెడుతున్నారు నా వెన కాల....సరిగ్గా నా కోసమేనన్నట్లు ఇప్పుడే మొద లయిందీ గాలివాన.

మధు : ఊఁ

సుధా : అప్పటికే నా గుండె పట్టేసింది. ఇక పరు గెట్టేలా లేదు నా పరిస్థితి. అంతలో అదృష్టం కొద్దీ నీ ఇల్లు కనిపించింది....

మధు : ఇంతకీ ఆ పోలీసు లేమైనట్టు ?

సుధా : బహుశ నేను ఈ ఇంట్లోకి రావటం కని పించి ఉండదు వాళ్ళకి.

(కొంచెం సేపు నిశ్శబ్దంగా దొర్లిపోయింది కాలం ఇరువురి మధ్యా)

మధు : (ఆలోచిస్తుంటాడు దీర్ఘంగా)

సుధా : ఒరేయ్ మధూ, ఎలా అయినా నువ్వే రక్షిం చాలిరా ! చూడు, నా కోసమైతే ఇంత బాధ పడే వాడినే కాదు. పోలీసులకి దొరికిపోయినా ఫర్వా లేదు. కాని మధు ....

మధు : [ఆత్రుతగా] ఊ చెప్పు.... కానీ....

సుధా : చెల్లాయ్....

మధు : అవును కుసుమ కేమయింది ?

సుధా : ఏం జరిగి ఏం ప్రయోజనం .... ఇటువంటి దురదృష్టవంతుడికి చెల్లెలయిన తర్వాత .... [బాధగా అంటాడు]

మధు : ప్లీజ్ ! సుధా ముందు చెప్పు....

సుధా : మేరేజ్ సెటిలయ్యింది .... నిన్నే. ముహూర్తం పెట్టించటం తరువాయి. పెళ్ళి కొడుకు డాక్టరు. కట్నం కూడ అక్కర్లేదన్నాడు. నీకూ చెపుదామను కుంటున్నాను ఈ రోజో రేపో .... ఇంతలో....

మధు : [ఆశ్చర్యంగా] ఐసీ !

సుధా : నేను జైలుకు వెళ్ళాలని భయపడటం లేదు. కాని నేను జైలుకెళ్తే అందులోను హత్యా నేరం మీద .... ఏనాటి కయినా పెళ్ళవుతుందా దానికి?

మధు : సుధా !

సుధా : (బాధగా) అవును మధూ, అమ్మా నాన్నా లేని లోటు తెలీకుండా చిన్నతనంనుండి అల్లారు ముద్దుగా పెంచానే.... దాని పెళ్ళిచేసి నా చేతిమీదుగా అత్తవారింటికి పంపాలని ఆశపడ్డానే! .... ఇపుడు దాని గతేమిటి ! హంతకుడి చెల్లెలిని ఎవరు చేసికుంటారు ? .... చేయని నేరానికి నిందితుడమ్యే ఈ అన్నయ్య కారణంగా కుసుమ జీవితం నాశనమవుతుంది మధూ .... (చేతులతో తలమీద బాదుకుంటాడు).

మధు : సుధా !

సుధా : అవును మధూ, అందుకే నిజంచెప్పి లాభం లేదని తెలిసి తప్పించుకోవాలని చూస్తున్నాను. నా చెల్లెలి కోసమయినా సరే వాళ్ళకు పట్టుబడను....

మధు : ఎక్కడ దాక్కుంటావ్ సుధా? ఇల్లంతా వెతుకుతారు వాళ్ళు అనుమానంవస్తే.... అందులోను ఈ కత్తి ! ! (సంశయంగా చూస్తాడు)

సుధా : తప్పదు మధూ ! నేను వాళ్ళకు దొరక్కూడదు.... అది నీ చేతుల్లోవుంది.... ప్లీజ్!

మధు : [బాధగా, జాలిగా] సుధా !

సుధా : మధూ, కుసుమ నాకు చెల్లెలయినా. చిన్నప్పటి చనువుతో దాన్ని నువ్వూ చెల్లెలిలానే అభిమానించావు. నా చెల్లెలు కాదనుకో ........ నీ చెల్లెలి కోసమయినా నాకో దారి చూపించు....

మధు : [దీర్ఘంగా ఆలోచిస్తుంటాడు]

సుధా : వేరేదారి ఏమీలేదా, వెళ్ళిపోవటానికి ?

మధు : [తలెత్తి] నువ్వీసమయంలో ఇక్కడనుండి కదలటం ఎంత ప్రమాదకరమో తెలుసా !

సుధా : ఇక్కడుంటే వాళ్ళు తప్పకవస్తారు [మళ్ళీ తలుపువైపు భయంగా చూస్తాడు]

మధు : ఫర్వాలేదు, నేనున్నాగా నీకేం భయంలేదు.

సుధా : మరి ఈ కత్తి ? ? ?

మధు : దాన్నక్కడే ఉండనీయ్.

సుధా : [ప్రశ్నార్థకంగా చూస్తాడు]

మధు : హంతకుణ్ణి నేను సుధా !.... అవును నేనే....

సుధా : [దాదాపు అరచినట్లు, ఆశ్చర్యంగా] మధూ :

మధు : [చిరునవ్వుతో] అవును సుధా ! నా చెల్లెలి కోసం నేనామాత్రం త్యాగం చేయలేనా ?

సుధా : [కంపిస్తున్న స్వరంతో] మధూ, అంత పని చేయకు.... వద్దు....

మధు : నీకోసం కాదు సుధా, నా చెల్లెలికోసమయినా తప్పదు....

సుధా : లేదు మధూ ! నన్నెక్కడయినా దాస్తావనుకున్నానేగాని, ఇంత సాహసం చేస్తావనుకోలేదు .... వద్దు మధూ.... కుసుమ పెళ్ళి జరగకపోయినా ఫర్వాలేదు .... నువ్వెళ్ళొద్దు.

మధు : (పేలవంగా నవ్వి) ఒరేయ్ సుధా : నేను ఎవరికి కావాలిరా ? డబ్బుంది ఆస్తి కావలసినంత ఉంది. నేను పుట్టినపుడు అమ్మ చచ్చిపోయింది.... అమ్మను పొట్టపెట్టుకున్నానని నాన్నగారికి నేనంటే ద్వేషం. ఎన్నికి నా ఉనికే అవసరం లేదు .... చివరికి ప్రేమించిన వాళ్ళూ దూరమయ్యారు ... ఇపుడు ఆ సుధని చేసికుని ఏం సుఖపెట్టగలనని అందరూ చేసికోమంటున్నారు .... విధివిలాసంలో ఓ ఆట వస్తువుని. మొండివాణ్ణయి మోడువారిన ఈ బ్రతుకు నీడుస్తున్నాను. ...[గొంతు గాద్గదికమవుతుంది] అలాంటి నా జీవితం వలన మరొక నిండు జీవితం నిలబడుతున్నపుడు ఎందుకు వెనకాడాలి?.... అంతకన్నా నాక్కావలసిందేముంది .... ఫరవాలేదు ... నన్నాపకు.... వెళ్ళనీ.... !

సుధా : [కనుల వెంబడి నీళ్లు ప్రవహిస్తుంటాయ్ ధారగా] మధూ : నీ త్యాగం, మంచితనం నేను భరించలేను. వద్దు .... నా కారణంగా నీ జీవితాన్ని నాశనం చేసికోకు.

మధు : లేదు సుధా! చెల్లాయ్‌మీద నీకే మాత్రం అభిమానమున్నా నన్నిలా ఆగమనవు.... ప్లీజ్ లెట్ గో ...(రెండడుగులు ముందుకు వేస్తాడు. టక్ టక్ టక్ తలుపు చప్పుడు)

సుధా : (అతనికి అడ్డంగా వచ్చి) మధూ నీ త్యాగంతో నా హృదయాన్ని బద్దలుచేయకు.

మధు : సుధా! నువ్ త్యాగం అంటూ ఏదో పెద్ద మాటలు ఉపయోగిస్తున్నావ్. కాని అందుకు నేను అరుణ్ని కాదు. ఒక స్నేహితుడుగా, ఒక చెల్లెలికి అన్నగా ఆ మాత్రం చేయలేనపుడు 'స్నేహం' అనే పదానికి అర్థమేమిటి? చెప్పు.... ఎక్స్యూజ్‌మీ! నా నిర్ణయం మారదు.

[సుధాకర్ చేతులను తన భుజం మీదనుండి తప్పించుకొని వెళ్ళి తలుపు తీస్తాడు. కృష్ణ, జగన్, సుబ్రావ్, రవి ఒకళ్ళనొకళ్లు తోసికుంటూ లోపలకు ప్రవేశిస్తారు.]

మధు : వాట్ రవీ, ఏమిటిది? ఇలా వచ్చేరేమిటి వేళకాని వేళలో.

రవి : వండ్రఫుల్! రియల్లీ వండ్రఫుల్! మధూ! ఎంత గొప్ప హృదయం నీది.

మధు : ఏమిటి రవీ, నువ్వేమంటున్నావో నాకర్థం కావటంలేదు.

జగన్: ఆపవోయ్, జరిగింది నిజమో, కాదో అర్థం కాక నే చస్తుంటే....

కృష్ణ : నిజం మధూ, ఇలాటి త్యాగం ఏదో కథల్లోను, సినిమాల్లోను చూశామే గాని నిజంగా.... ఓహ్ నీలాటి స్నేహితుడు ఉండడం మా అదృష్టం. [భుజం తడతాడు]

సుబ్రావ్ : రియల్లీ మధు, యూ హావ్ దట్ ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజ్ ఎ ఫ్రెండ్ ఇన్‌డీడ్...హేట్సాఫ్ టు యూ మై ఫ్రెండ్ !

మధు : [చెవులు మూసికొని] ఆపండి, మీరేమంటున్నారో నాకు ఏమీ తెలీటంలేదు. [సుధాకర్ వైపు చూస్తూ] ఏమిట్రా ఇదంతా ?

జగన్:[ముందుకొచ్చి]నన్ను చెప్పనీయవోయ్ సుధా! నిన్న సాయంత్రం పార్క్‌లో కూర్చుని మాట్లాడకుంటుండగా నీ విషయమై ఏదో చర్చ వచ్చింది. సుధాకరం నీ గురించి ఏదో ఏదో చాల గొప్పగా పొగిడే సరికి మా కందరికి ఒళ్ళు మండి....సారీ గురూ....ఏమిటోయ్ ఆ మధుగాడి గురించి తెగ పొగిడేస్తున్నావ్, ఏమిటో మీవాడి గొప్పతనం చూపించు చూద్దాం అంటూ ఛాలెంజ్ చేసి పడేశాం.

మధు : [సుధాకర్‌కేసి చూస్తాడు చిరుకోపంతో]

సుధా : ఏమిట్రా అందరూ కలిసి మధుగాడ్నే పొగిడేస్తున్నారుగాని....నా యాక్షన్ మాట ఎవడయినా ఎ తేడా అసలు....అబ్బ....ఎంతకష్టపడి ఎంత నేచురల్‌గా చేశాను....ఆ ఫీలింగ్‌లు.... ఓహ్ !

సుబ్రావ్ : ఫీలింగ్‌సందుకున్నాయ్ లేవోయ్....బోడి ఏక్షనూ నువ్వూనూ! ఎవ్వరూ పొగడలేదని నీఅంతట నువ్వే తెగడబ్బాకొట్టుకొంటున్నావ్....

జగన్ : మొన్నమొన్న అప్పారావ్ గాణ్ణి ఓ అయిదుంటే అప్పివ్వరా అనేసరికి, ఎప్పుడెప్పుడో ఎగబెట్టిన బాకీలన్నీ గుర్తుకుతెచ్చి....ఫూల్, కొట్టినంత పనిచేశాడు. వాడా ఫ్రెండంటే;

కృష్ణ : నాది మరీ ఘోరంరా ! ఆ కామేశంగాడ్ని ఎన్నిసార్లు హోటల్‌కి తీసికెళ్ళలేదు, ఎన్నిసార్లు సినిమాలకి తీసికెళ్ళలేదు? వాడ్ని ఓరోజు గురూ రేపు హేమ్మాలిని డేన్స్ ప్రోగ్రాం టికెట్ తియ్యమంటే ఏమన్నాడూ....

రవి : అంతవరకూ ఎందుకురా? నాల్రోజులక్రితం ఓ కవిత వ్రాసి చదవరాబాబు అని విశ్వంగాడి ముందు పట్టుకు నుంచుంటే వాడు చదివితేనా ? పోనీ నేను చదివి వినిపిస్తాన్రా బాబూ అంటే.... ప్చ్ .... రోజూ వాడికి సైకిల్‌మీద లిఫ్ట్ ఇచ్చేవాణ్నా....రాస్కెల్‌కి అంతమాత్రం విశ్వాసం కూడా లేకపోయింది.

సుబ్రావ్ : ఒరే బాబూ చదవక చదవక నీ కవితలే చదవాలి. ఏదో ఏడ్చావ్‌లే అని ఓసారి చదివి పది రోజులపాటు మంచమెక్కటము నాకు బాగురుందిరా రవీ! చాల్లేగాని నెల్లాళ్ళక్రితం ఓసారి లతకి ప్రేమలేఖ ఎలా వ్రాయాలో తెలీక నాలుగయిదుటావులు తగలేసి, ఇలా నా అంతట నేనే వ్రాస్తే ప్రేమించబోయేదల్లా జడుసుకుని ఎక్కడ మానేస్తుందోనని చివరికా భాస్కరంగాడి కాళ్ళు పట్టుకుంటే .... 'వెధవాయ్–దేవానంద్‌లా తెగ ఫోజు కొట్టాడు....ఎన్నాళ్ళుగా

ప్రయాస పడినా ఆ దేవానంద్ ఫోజు వస్తుందా ఆ మొహానికి....ఈ రాస్కెల్సంతా మధుగాడ్ని చూసి బుద్ధి తె....

మధు : [కోపంగా] ఏయ్ సుబ్బారావ్! ఆపు నీ దండకం........ఏమిటిదసలు మీ మతులేమైనా పోయాయా ?

సుధా : నిజమే మధూ, నిన్ను చూసేకా నిజంగానే పోయుంటాయ్ వాళ్ళమతులు,....చూడు నీ మీద నా కున్న విశ్వాసం ఈ చిన్ననాటకం ఆడించిందంతే....ఇపుడు నిజంగా నా కెంత గర్వంగా ఉందో తెలుసా, నీలాటి స్నేహితుడున్నందుకు అయామ్ రియల్లీ ప్రౌడ్ ఆఫ్ యూ !

మధు : నే చేసిందేమీ లేకపోయినా పొగడ్తలతో ఇబ్బందిలో పెడుతున్నావ్! సుధా. స్నేహం అంటే అదొక మధురమైన అనుభవంరా. ఆ అనుబంధం బంధుత్వానికన్నా గొప్పది. దాన్ని ఎవరయినా శాశ్వతం చేసికోవాలేగాని త్రెంచుకోవాలని చూడకూడదు.

ఇలా ఇక్కడ మనం అందరం ఏ కారణం చేతనయినా కానీండి కలుసుకున్నాం. నిజంగా నా కెంతో ఆనందంగా ఉంది. మనం ఏనాటికీ స్నేహితులుగానే ఉండిపోవాలి ఇలానే. స్నేహం అంటే మనదే అనిపించాలి. ఓ.కె. [చేయి జాపుతాడు].

[అందరూ అతని చేతిలో చేయి వేస్తారు. "స్నేహబంధమూ, ఎంత మధురము, చెఱిగిపోదు తరిగిపోదు జీవితాంతమూ...." నేపథ్యంలో నుండి మృదుమధుర స్వరం వినవస్తుంటుంది]

— ....సమాప్తం.... —

# "పూర్వజన్మ సుకృతం"

పి. గౌరినాయుడు
బి. ఎ. ద్వితీయ

సాయంత్రము 6 గం॥ లకు బయలు దేరిన నేను తిరిగి తిరిగి సైకిలును ఇంటి ముఖం పట్టించాను. అప్పుడే చిన్నగా గాలి వీస్తోంది. సైకిలు లైటు వెలిగించి తొందరగా వస్తున్ననేను లైటు ఎప్పుడు ఆరిపోయిందోన్న సంగతి పట్టించుకోకుండా వీధి లైట్ల వెలుగులో పోతున్నాను. నాసైకిలు వెనుకనే ఇద్దరు పోలీసులు అనుసరిస్తూ నాకు ముందుగా వచ్చి దారిదోపిడీగాండ్లులా నిలిపివేసారు. నాకు ఏమీఅర్థము కాలేదు. అందులో ఒకడు చెక్ చేస్తూ "లైటు లేకుండా పోకూడదని తెలుసా" అని అదలించాడు.

"లేదండీ, బహుశా ఇప్పుడే ఆరిపోయియుండ వచ్చును. చూడండి, ఈ లైటు ఇంకా వేడిగానే యుందని" నేను చెప్పాను. అయినా వినిపించుకో లేదు. "నీ పేరు" అన్నారు. నా సైకిలు స్టేషనుకు అప్పజెప్పుతామని, ఉదయంవచ్చి సంజాయిషి చెప్పు కొమ్మని బెదరించి నాలుగడుగులు నడిపించారా పోలీసులు. వేరొకడు రెండడుగులు వెనుకకు వేసి, 'అయ్యా, మీ రెవరో, అమాయకులులా ఉన్నారు....అతనెవరో తెలుసా. చండశాసన ముండా కొడుకు. వాడి చేతిలో పడ్డ ఏ వ్యవహారము అంత సులభముగా వీడదు. కాబట్టి ఏదో వాడి చేతులు తడి జేసి నీదారిని నీవుపో ...." అని రాయబారముచేసాడు. అప్పటికి నాజేబులో నాల్గురూపాయలు కెక్కువలేవు. ఉన్న కాస్త ఆ డబ్బులు వారిద్దరి మొఖాన గొట్టి ఆయమకింకరులచేతులలో నుంచి బయటపడి తిన్నగా ఇంటికి చేరుకొని ఆరాత్రికి ఉపవాసముతో నిద్ర పోయాను. గానీ నిద్రపట్టలేదు. ఆకలి సుడులు తిరుగు తున్నవి. ఈ పోలీసులు నిజంగా ఈ రూపములో యున్న యమకింకర్లేమో ననిపించింది.... ఆ నీరస ములో ఒకనాటి మా తాతగారు చెప్పిన కథ జ్ఞాపక మొచ్చినది.

....శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై రావణుని మరణానంతరము తిరిగి అయోధ్యకు వస్తున్న సమయములో తన జయానికి సహాయ పడిన ప్రతి యొక్కరికి కోరిన కోరికలు ఫలించు నట్లు వరములు ప్రసాదిస్తున్నాడు. ఏ ఒక్కరు కూడా మిగలకుండా వరాలు కోరుకొన్నారు. పుష్పక విమాన ములో వచ్చిన వారందరినీ అయోధ్య తీసుకొని వెళ్లడానికి సంసిద్ధుడౌతున్న సమయమందు కొన్ని గండభేరుండ పక్షులు తమ పక్షి సమూహము నంతయు వెంటబెట్టుకొని శ్రీరాముని దగ్గరకు వచ్చి చుట్టూ నిల్చుండి వందనము నాచరించి ....

"శ్రీరామచంద్రా .... రావణునితో యుద్ధము సమాప్తి అయినది. సీతమ్మతల్లితో ఆనందముతో పుష్పక విమానములో అయోధ్య చేరుకొని ఉవ్విళ్లూరు చున్నావు....నీకు పూతిక పుల్లంత సహాయము చేసిన ప్రతి యొక్కరికి వారివారి తలపులు నెర వేరునట్లు అనుగ్రహించినావు గానీ .... మమ్ము మాత్రము మరచినావు....,, అని గండభేరుండము నమస్కరించి విన్నవించుకున్నది. అది విని శ్రీరాముడు "ఓ పక్షిరాజమా ! ఏమి నీ విన్నపము. నాకు అగోచరంగా యున్నది....నాకు సహకరించినవారంద రికి ప్రత్యుపకార మొనర్చితివి ....గానీ మీరు అనగా మీ పక్షిసంతతి నాకు ఎచ్చట, ఏవిధంగాసహాయపడి తిరో తెల్పిన నాతొందరపాటుకుమిమ్ములను క్షమార్పణ వేడుకొని మీకు వలయు వరములను అనుగ్రహించు వాడను" అని శ్రీరాముడు చెప్పగా గండభేరుండము వినయంతో "కోదండరామా! రామరావణ సంగ్రా మమునందు నీ పదునైన బాణములు శత్రువులను ఒక్కదెబ్బతోనే కూల్చివేసి ఆ శరీరములో నాటు కొని యుండ నొల్లక బయటకు దూసుకొని వెళ్ళి పోయినవి. మరియు ఈ వానర సైన్యము శత్రువు లను చెండాడి వారి మృత కళేబరములు మధ్య ఒక్క క్షణముకూడా నుండ నిచ్చగించక వెళ్ళిపోయిరి. భయంకరంగా నుండిన యుద్ధభూమిలో శవాలను పీక్కుతినటానికి నక్కలకు కూడా అసహ్యము కలిగినది....గానీ మేము అచంచలమైన నీపై యున్న ప్రభుభక్తితో ప్రాణములను నీ శరములకు అర్పించి నేలకొరిగిన వారి మృతదేహములపై వాలి రాత్రనక పగలనక మా పగ చల్లారునంత వరకు మా వాడి

యైన ముక్కులతో, గోళ్ళతో రక్కి "కోదండ రాముని అర్ధాంగి సీతమ్మ తల్లిని చెరబట్టిన మూర్ఖుని చేత ఇన్నాళ్ళు పోషింపబడిన నీచులారా.... మీ కండను కండ పీక్కుతిన్నను మా పగ చల్లారదు. మా ప్రభువు మనస్సు శాంతించదు" అని మేము చచ్చిన శవాలపై మామీదయున్న భక్తికొలది మా పగ సాధించాము.... కాబట్టి మాకుకూడా ఈజన్మలోచేసిన ఈ చిన్నపుణ్యమునకు తగిన వరము మరుజన్మకు ప్రసాదించు స్వామి" అని గండభేరుండాది పక్షులు కోరుకున్నవి. అందుకు రాఘవుడు వాని ప్రభుభక్తికి ఆశ్చర్యపోయి సకల సంతోషంతో "ఓ పక్షి సముదాయమా! నా తొందరపాటును క్షమించండి.... మీలో ఇంతటి ప్రభుభక్తి, విశ్వాసము దాగియున్నవని ఊహించలేకపోతిని.... కాబట్టి మీరు కోరినవరము ప్రసాదించ సంసిద్ధుడను" అని శలవియ్యగా....పక్షులు అన్ని ఒక్కమాటగా తీర్మానించుకొని "రాఘవా! ఈ జన్మలో మేము కేవలము క్షుద్ర జీవితము గడిపాము! మరుజన్మలో మేము నరులమై పుట్టే వరము ప్రసాదించండి స్వామీ! మరియు ఒక్క మనవి. ఈ జన్మలో మేము ఎవరమో-అన్న సంగతి గుర్తుగా వచ్చే జన్మలో మాకు జ్ఞాపక చిహ్నములునుకూడా అనుగ్రహించు స్వామి" అని కోరుకున్నవి.

అందుకు శ్రీరాముడు నవ్వి "ఓ పక్షి సముదాయమా; వినండి. మీకు నరజన్మపై మిక్కిలి ఆసక్తి యున్నట్లు తెలియుచున్నది. కాబట్టి వచ్చే జన్మలో రోరందరు నరులుగా పుట్టి పోలీసు వృత్తులను స్వీకరిస్తారు....ఈ జన్మలో పాపం మీరు కేవలం చచ్చిన శవాలనే పీక్కుతిని తిని విసిగిపోయారు. గానీ వచ్చే జన్మలో మీరందరు పోలీసులుగా మనుషులను నిలువునా ప్రాణాలతోనే హింసించి పీక్కుతింటారు. ఇదే నేను మీకిచ్చే దివ్యవరము. మీరు గత జన్మలో పక్షులని తెల్సుకొనుటకు నిదర్శనంగా మీరు నిర్దాక్షిణ్యంగా అర్ధణాకి, పైసకు కూడా చేతులు చాపే స్థితికి దిగజారే కాలం కొన్నాళ్ళకు మీకు వస్తుంది. దానిని బట్టి మీ మీ పూర్వజన్మలను ఒక్కసారి జ్ఞాపకం చేసుకొనగలరు, అని శ్రీరాముడు వరమిచ్చి అయోధ్యకు వెళ్ళిపోయాడు. ఈ పక్షిసమూహమంతా నర రూపములో పోలీసులై జన్మించారని .... మా తాతయ్య జెప్పిన కథ నన్ను కొంత ప్రశాంతంగా నిద్రుపోనిచ్చింది....ఇందులోపోలీసుల తప్పేమీలేదు. వారలా నా దగ్గరి డబ్బులుకు పుణ్యం కట్టుకున్నారంటే అంతా వారి పూర్వ జన్మ సుకృతము; వారు సంపాదించుకున్న వర ప్రసాద బలమని నా మనస్సును సరిపెట్టుకొని, నాలో నేనే కొన్ని సార్లు నవ్వుకొని ఎప్పుడైనా పోలీసు ఎదురుపడితే ముందుగా నా బెల్ యుందా లేదా! రాత్రయితే లైటు వెలుగు తుందా? లేదా? అని చూసుకొని జాగ్రత్త పడతాను ....

కొన్ని సార్లు తాతయ్య దివ్యదృష్టి కలిగిన మునీశ్వరుడిలా ప్రతి యొక్కరి పూర్వ జన్మ సుకృతము ఈ జన్మలో ఎలా అనుభవిస్తున్నారో అని కనిపెట్టి చెబుతుండేవారు. ప్రక్కింటి రాంబాబు సామాన్య కుటుంబీకుడైనందు వలన తన జీతం ఇంటి జీవనముకే సరిపోతుండేది. కాబట్టి నాలుగు రాళ్లు వెనకేసుకొనే ఆధారము లేనందున పెళ్లీడు కొచ్చిన ఇద్దరు ఆడపిల్లలను అలాగే నాలుగేళ్ల నుండి ఇంటిలో యుంచుకున్నాడు. సామాన్యంగా కట్నాల బేరములో రాంబాబు ఇద్దరి పిల్లలకు ముప్పై నలభై వేలు రూపాయిలకైనా ఇద్దరు మగ మహారాయళ్ళను కొనుక్కోలేకపోయాడు....ఈసంగతి ఒకరోజు తాతయ్యతో చెబుతూ తన దుస్థితికి కంటతడి బెట్టుకున్నాడు. అది చూసి తాతయ్య వారి కాలమునాటి పెళ్ళిళ్ళకు, ఇప్పటి పెళ్ళివ్యవహారాలకు ఎన్ని యోజనముల వ్యత్యాసమొచ్చిందోనని తీవ్రంగా ఆలోచించి కోపము పట్టలేక...."ఊరుకో రాంబాబూ! 'ఒకరిని అనుకుంటే లాభమేముంది? అంతా ఇప్పటి వరకట్నదాసులు తెచ్చుకున్న వినాయకుని వరమయ్యా! అది తప్పించ మన తరము కాదు. ఇలాంటి వరమిచ్చిన ఆ బొజ్జ గణపయ్యను ఏమైనా అనాలి....గానీ మధ్యన యీ కట్నాలు కోరిన కుర్రకార్లను నిందించితే లాభం లేదు....అదంతా మన పిచ్చి భ్రమ" అని తాతయ్య ఒక్క గుక్కలో తన అక్కస్సునంతా వెళ్ళగక్కాడు.

....ఇదంతా ఏమిటో నాకు అర్థంగాక "తాతయ్యా! నువ్వంటున్నదేంటో నాకు అర్థంకాకుండాయుంది.... ఏదో వినాయకుని వరమంటున్నావు....ఆ బొజ్జ గణపతిని తిట్టాలంటున్నావు....ఏంటో చెప్పు తాతయ్యా" అని మారాము చేశాను. అప్పుడు తాతయ్య "అవును బాబూ ...

పూర్వకాలమందు ఏనుగులు తమ ఇచ్ఛవచ్చినట్లుగా విహారం చేసుకుంటూ వాటికి దొరికినచోటెల్లా పెద్ద పెద్ద వృక్షాలు సహితం పెల్లగించి రొడ్డా, రోలు తిని మదించిపోయి తిరుగుచుండేవి. చివరకు కొన్నాళ్లు గడిచాక భూమిమీద పచ్చనిఆకు కూడా వాటికి కరువై పోయింది.... అప్పుడు ఆ ఏనుగులన్నీ ఆకలితో మలమల మాడిపోతూ చిక్కి సగమై పోయి కొన్ని జీవాలు కూడా కోల్పోతున్నాయి.... తుదకు అవన్నీ ఒకరోజు ఒకచోట చేరి వాటి అధినాయకుడైన వినాయకుని ఎలుగెత్తి ఏడుస్తూ ఘీంకారధ్వనులతో ఒంటి కాలిపై ఆ బరువైన శరీరాలు నిల్పి ప్రార్థించడం మొదలు పెట్టాయి. ఇలా కొన్ని సంవత్సరాలు ప్రార్థించగా, ప్రార్థించగా చివరకు వినాయకుడు వాటి మొర ఆలకించి వాటికి దర్శనమిచ్చివాటిసమస్య ఏమిటో పరిశీలించాడు. అప్పుడు "విఘ్నేశ్వరా....ఈ భూమిపై మేము తినడానికి పచ్చనిఆకైనా, గడ్డిపోచైనా కరువై పోయింది. మేము ఇక బ్రతకలేము కాబట్టి తిరిగి మాకు భూమిపై ఆహారం కల్పించండి స్వామి" అని ప్రార్థించుకొన్నవి.

అందుకు వినాయకుడు జాలిచెంది 'ఓ గజ సమూహమా ! భూదేవికి మీ భారమువలన కోపంకలిగి తాను మీకు పచ్చని గడ్డినైనా మొలిపించ ఇష్టపడకున్నది. అయినా మీ సంతతిలోని వారు చాలామంది తనువు చాలించారు. మీలో చాలమంది చిక్కి సగమై పోయారు....కాబట్టి మీరు అధికకాలం జీవించి యుండియు ఈ జన్మలో సాధించేది ఏమియులేదు ... కాబట్టి ఈ జన్మకు ఈ తనువు చాలించండి. మీ ప్రార్థనకు ప్రతిఫలంగా మీకు వచ్చే జన్మలో మంచి మార్గాలు ఏర్పాటు చెయ్యదలచుకున్నాను ....అదేమనగా, అందరు శ్రద్ధగా వినండి "మీ రందరూ వచ్చే జన్మలో మనుషులై పుడతారు. 20 వ శతాబ్దములో పుడితే ఇంకా మీరు అదృష్టవంతులు. ఎందుకంటే నరలోకములో ముందు ముందు అన్ని నియమములలో మార్పులు రానున్నవి. ఆ మారుతున్న పరిస్థితుల్లో 'వరకట్నమనే' భాగ్య చక్రము మీపాలిట రానున్నది. అప్పుడు మీరు అందరూ ఇప్పుడు ఎంత ఆకలి మంటలతో నకనకలాడిపోయి తనువులు చాలిస్తున్నారో ఆ వచ్చే జన్మలో మీ ఆకలి తీరినంతవరకు ఆడపిల్లలు గల తండ్రులను బాధించి వేధించి కట్నాలు గుంజుకొని మీ ఆకలి తీర్చుకొనవచ్చును. అప్పుడు మీ ఆకలి పూర్తిగా తీరుతుంది....ఇదే నా వరము" అని వినాయకుడు అంతర్ధాన మయ్యాడు.

....కాబట్టి ఇది బాబూ ; వినాయకుని వరమంటే ఇదే. కాబట్టి వాళ్ల ఆకలి తీరినంతవరకు వారు కట్నాలు కోరుతూనే యుంటారు. కాబట్టి గత జన్మలో వీళ్లు ఏనుగులన్న సంగతి ఆడపిల్లలుగల తండ్రులు మరచిపోకుండా వారికి మేత వేయక తప్పదు....ఇలాంటి పూర్వ జన్మ సుకృతమువల్ల కొంతమంది పుడతారు....కాబట్టి వాళ్ళను సంతృప్తి చెందించక తప్పదని రాంబాబు వంటివాడు తెల్సుకోవాలి. గానీ.... ......వాళ్ళని నిందిస్తే వచ్చేజన్మలో మనకొక శాపము ఏదైనా రాగలదు..........అని తాతయ్య నాకు కొన్నిసార్లు చెబుతుంటే ఇలాంటి వింత కథలు అబద్ధం కాదేమో అనిపిస్తుంది....

పై రెండు సంగతులు చదివిన తరువాత మనము పూర్వజన్మలో ఏ వరములు వెంటతెచ్చుకొన్నామో నని ఒక్క క్షణము ప్రతి చదువరి ఆలోచిస్తే నేను చెప్పిన 'మా తాతకథలు' అబద్ధం కాదని అనుకుంటాను.

[ఇది కేవలం కల్పితం....]

# మహాత్మా! మళ్ళీ అవతరించు!!

యస్. వెంకటేశ్వర్లు,

అశుభం శుభం తెలియని
అమాయకుల ఆత్మలు సంక్షోభిస్తున్నవి.
అనవరతం
అజ్ఞానుల అధికారం అధిగమిస్తున్నది.
నీ పాలించిన రామ రాజ్యానికి
రాగ మధురిమ కరువై పోయింది.
కలుషాత్మల కరాలలో నీ కమనీయ తేజోరూపం
వెల వెల పోతున్నది.
నీ ఆదేశాలు, ఆశయాలు, ఆ ధర్మాలు
నీతోనే పయనించి వచ్చాయి.
నీ కాలపు కర్పూర నీరాజనం
కంట తడి పెట్టోంది.
నీ మార్గపు మధుమాసం
మరణాన్నాశిస్తోంది.
నీ నిర్మల నిరాహార దీక్షలు
నిండైన ఆహారం కోరుతున్నాయి.
మా మానవ ప్రగతంతా; దీనుల శోకంతో
మట్టిగలిసే రోజు వస్తోంది.
సామాన్యుడి సంతోషం
సంగ్రహించే సాహసికులు
సార్వజనీన సౌభాగ్యం
సమసింపజేసే స్వార్థ పురుషులు
నిండైన రత్న గర్భని .
నిరంతరము బాధించే నిబిడాంధకారంలో
మహాత్మా ! నీవు
మళ్ళీ అవతరిస్తావుకదూ !

---

# ఆదినుండి అంతము వరకు....

టి. సత్యనారాయణ IInd B. A.

అమ్మనంటిది 'అ' అక్షరము
ఆదరిస్తావు పుట్టుకతోనే అ...అ...అ అంటూ
అలవాటు అవుతుంది అమ్మా—అమ్మా అంటూ
ఆ పిలుపుతోనే ఆదరిస్తారు అందరూ
ఆడుకుంటావు అందరితో అరే—అరే అంటూ
ఆ పిలుపుతోనే పెంచుతావు నీ అధికారాన్ని
అంతవాడివై, యింకెంతో పెద్దవాడివై
అలముకున్న అంధకారములో ప్రవేశిస్తావు.
అలవరచుకుంటావు సంఘములోని అలవాట్లు
అవి మానలేవు అలవాటైతే
అందరితో తిరగలేవు, వారు ప్రజలే
అని తెలుసుకోలేవు. అసహ్యించుకున్నా
ఆదరిస్తారు నిన్ను అభిమానముతో
అణగద్రొక్కేస్తున్నావు వారిని,
అసమానతతో అల్లరి చేస్తున్నావు.
అరుస్తున్నారు నీ బాధ పడలేక, పాపం
అరణ్యరోదనముగా మిగిలింది వారి బ్రతుకు
అజ్ఞానముతో, అసమానతతో
అలుముకున్న అంధకారముతో
అలంకరించుకున్నావు భయంకర ఆకారాన్ని
ఆణిముత్యమునంటిది మంచితనము
అగ్నిగోళమువంటిది చెడ్డతనము
అర్థం చేసుకుంటె తెగదు మాతో అనుబంధము
అధికార దాహముతో మారింది నీ మనస్సు,
అంధకారములో తరిగింది భారతి యశస్సు !

అన్నది నిన్న అంతా రోత చేస్తున్నావనీ
అహంకారాన్ని చూసి, నీ
అసహాయ స్థితిని చూసి
ఆక్రోశించింది భరతమాత
అణచివేయవద్దు ఈ సమాజాన్ని అని
ఆలోచిస్తావు నీ గురించి మాత్రమే !
ఆలోచించవే మా గుఱించి !
అయినా పండకపోదు నీ పాపం !
అనుభవించకపోవు పరితాపం !!
అందుకోనవద్దు అందరి ఘోర శాపం !!!
అహంభావం పనికిరాదోయ్
అధికారము తోడు రాదోయ్
ఆవేశము మరచిపోయి
ఆశయాలను, ఆదర్శాలను చేపట్టి
ఆకలిదప్పులు—ఆర్తనాదాలు
అణచివేసి, అందరితో
ఆనందముతో సుఖించవోయి
అవే భావి జీవిత దోహదాలు
అదేనోయి పరమార్థం
ఆదర్శ చక్రవర్తులగు
అశోకుడు, అక్బరు, అమర ప్రతాపులు
అధర్మమును విడిచిపెట్టి
అదిగో ! చరిత్రలో మైలు రాళ్లను ఏర్పరచినారు.



B. Sc., Final – Maths (Main)



B. Com., Final

# कद्दू - बुद्धू

एन॰ सि॰ किशोर
जूनियर इन्टर

बहुत तेज थी धूप झुलस गया था रूप।
जा रहा था सड़क पर तभी मियां अनूप। ।

जाते जाते लगा जब, उसको आलस आने।
बैठ गया एक पेड के नीचे और लगा सुस्ताने ॥

कुछ देर बाद जब देखा उसने ऊपर।
आ गई तरस उसे तब ईश्वर की बुद्धि पर॥

था बेल का पेड लिपटी उससे इक लता।
कहने लगा हे ईश्वर! तुझे कुछ है नहीं पता ॥

इतनी कोमल लता पर उगाये बड़े से कद्दू।
तू तो लगता हैं मुझको सिर्फ एक बुद्धू॥

बड़े से इस पेड पर छोटे छोटे बेल।
तू तो सब परीक्षाओं में जरूर होगा फेल

तभी अचानक उसके सरपर जोरो से हुआ।
प्रहार 'बेल' का चीखा जोरों से आह ॥

उसके मुँह से निकला मैं हूँ एक बुद्धू।
सर फटता मेरा अगर गिरता एक कद्दू।।

# सुधार

एन॰ सि॰ किशोर
जूनियर इन्टर

हमारे देश के एक नेता थे बड़े महान ।
उन्हीं का नारा था जय जवान-जय किसान ॥
अब तो यह नारा भूल गये सब कोई ।
सब करते हैं 'प्यार' सुनो मेरे भाई ॥
नहीं करते कुछ काम और है नहीं पढ़ाई ।
करते आवारागर्दी है, न जाने किसने सिखाई !

बाप भगा दे घर से गर यारों का ।
अक्ल आ जायेगी तब ही प्यारों को ॥

मांगेगे जाकर गली-गली में भीख ।
आयेगी अक्ल और मिलेगी सीख ॥
अभी तो तब करते क्लबों में हरे कृष्णहरे राम ।
तब करेंगे प्रार्थना मुझे बचा लो श्याम ॥
अभी तो खोजते है फिल्मों में चान्स ।
तब करेंगे सड़कों पर घूम घूम कर डान्स ॥
यही तो तरीका है इन्हे सिखाने का ।
और सीधे रास्ते पर जल्दी से लाने का ॥

———

# कबीर की प्रतिभा

वी. एस. गुरुनाथ. जूनियर इन्टर

पुरातनकाल से इस देश में होनेवाले सन्तों धर्माचार्यों एवं लोकनायकों की यह परिपाटी रही है कि उन्होंने अपने जीवन काल में लोक कल्याण के लिए अपने आदर्श जीवन हृदय से निकलनेवाली वाणी और दूसरे लोक कल्याणकारी कार्यों द्वारा समाज और राष्ट्र को ऊपर उठाया। उसे नई दिशा बतलाई। पर वे अपने सम्बन्ध में सर्वत्र मौन रहे। किसी के द्वारा कुछ पूछे जाने पर भी वे इन प्रश्नों को व्यर्थ समझ कर चुप रह जाया करते थे। जहाँ वे अपने जीवन और सत्यपूत वाणी द्वारा शाश्वत सत्य प्रकट किया करते थे, वहाँ वे अपने इस आत्म गोपन में ही जीवन की चरितार्थता समझते थे।१ कबीर भी इसके अपवाद नहीं थे।

लेकिन इन महापुरुषों की मृत्यु के बाद उनके ऐतिहासिक जीवनकी छानबीन करना बहुत कठिन हो जाता है। इनके काव्यों द्वारा इनके समकालीन कवियों की रचनाओं के द्वारा, उनके समय के राजनैतिक, सामाजिक और धार्मिक परिस्थितियों के विश्लेषण से शिला लेख आदि से विद्वानों ने उनके गोपनीय चरित्रों को जानने की चेष्टा की है। पर वे आपस में एक निर्णय पर नहीं आ पाते हैं। लेकिन जीवन चरित्रों से एक व्यक्ति को जानने से अच्छा उस व्यक्ति की प्रतिभा में उसे हम ज्यादा जान सकते हैं। जैसे स्वयं कबीरदास जी ने कहा है।

"जात न पूछो साधु की, पूछ लीजिए ज्ञान" हमें किसी व्यक्ति को जानने के लिए उसके जीवन को नहीं उसकी प्रतिभा को जानना चाहिये।

प्रतिभा के अन्तर्गत प्रधान रूप से चार शक्तियाँ आती हैं — तत्व ग्राहिणी शक्ति, तत्व धारणा शक्ति, उद्भावना शक्ति, और अभिव्यंजना शक्ति। कबीर में यह चारों शक्तियाँ अपरिमित मात्रा में विद्यमान थीं। उनकी तत्व ग्राहिणी शक्ति तो इतनी प्रखर थी कि वे जटिल से जटिल और दुरूह से दुरूह विषयों को सुनते सुनते ही समझ जाते थे। तभी तो वे भारत के प्रत्येक धर्म, दर्शन के सूक्ष्माति सूक्ष्म सारभूत तत्वों को आत्मसात करने में समर्थ हुये थे (२) और दर्शनादि की जटिलता तो मानी हुई बात है। उन्हे इतनी सूक्ष्माति सूक्ष्म बातें ज्ञात थीं कि जिनको सम्भवतः उस विषय के विद्वान भी नहीं जानते थे। कारणवश ही पण्डित मुल्ला, मौलवियों से विरोध था।)

---

१ "कबीर दोहावली" (टी) महेन्द्र कुमार जैन दक्षिण भारत हिन्दी प्रचार सभा प्रथम संस्करण 1953 पृष्ठ 16।

२ "कबीर की विचारधारा" डा. गोविन्द त्रिगुणायत एम ए. पी. एच डी., साहित्य निकेतन-कानपूर द्वितीय संस्करण 2014, पृष्ट 313

